వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com


# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 2 | సంపుటి : 4 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూలై 2025 | వెల : రూ 10/-



## దివి నుంచి భూవికి శుభాంశు శుక్లా

- ముగిసిన శుభాంశు శుక్లా రోదసీయాత్ర
- ప్రధాని మోడీ తదితరుల శుభాకాంక్షలు

కాలిఫోర్నియా,
భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసీయాత్ర ముసిగింది. ఆయన తిరగి క్షేమంగా భూమ్మిదకు చేరుకున్నారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతరిక్ష పరిశోధన కేంద్రం ఐఎస్ఎస్‌కి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా తిరిగి భూమిపైకి చేరుకున్నారు. అంతరిక్షంలో ఆయన 18 రోజులు గడిపారు. మానవాళికి ఉపయోగపడే ప్రయోగాలు చేశారు. అనంతరం డ్రాగన్ క్యాప్స్‌లో కాలిఫోర్నియా సమిపంలోని సముద్ర జలాలలో మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు సురక్షితంగా దిగారు. భూమికి తిరిగి రావడం సంతోషంగా ఉందని యాక్సియం-4 కమాండర్ పెగ్గీ విట్సన్

-మిగతా 3 లో



## బల్క్ డ్రగ్స్ రాజధానిగా
# హైదరాబాద్

**43 శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి**

- కోవిడ్ వ్యాక్సిన్ లతో అంతర్జాతీయ గుర్తింపు
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్,
ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకే గుర్తింపును తీసుకొచ్చాయి. దేశంలోని వ్యాక్సిన్ల ఉత్పత్తిలో 33 శాతం కేవలం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి చేస్తున్నాం. ప్రపంచాన్ని కోవిడ్ భయపెడుతున్న సమయంలో ఇక్కడి నుంచే వ్యాక్సిన్లు తయారు చేశాం. ప్రపంచ దేశాలకు సరఫరా చేయగలిగామని సీఎం అన్నారు. శామీర్‌పేట జీనోమ్‌వ్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఐకోర్ బయోలాజిక్స్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. మంగళవారం ఐకార్ బయోలజిక్స్ కొత్త

-మిగతా 3 లో




## నల్గొండను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలపాలి

- ఫార్మసీ,లా కాలేజీల ఏర్పాటు చిరకాల కోరిక
- మహాత్మాగాంధీ వర్సిటీ ప్రతిష్టను పెంచాలి
- నల్లగొండ విద్యారంగ అభివృద్ధిపై మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్,
నల్గొండను అన్ని రంగాల్లో నంబర్ వన్ గా నిలపాలనేది నా ప్రధాన ధ్యేయం అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. నల్గొండలో ఫార్మసీ కాలేజీ,లా కాలేజీ ఏర్పాటు- చేయాలనేది తన చిరకాల కోరిక అన్నారు.ముఖ్యమంత్రి సహకారంతో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తేవడానికి ప్రయత్నిస్తున్నాం అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో నల్గొండ అభివృద్ధి పై మంత్రి కోమటి రెడ్డి సమీక్ష నిర్వహించారు. నల్గొండను అన్ని రంగాల్లో నంబర్ వన్ గా నిలపాలనేదే తన ప్రధాన ధ్యేయమని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మరోమారు స్పష్టం

-మిగతా 3 లో



## కేరళ నర్సు నిమిష ప్రియ మరణశిక్ష వాయిదా..!

- యెమెన్‌తో కేంద్రం చర్చలు ఫలవంతం
- ఉరి అమలు తాత్కాలికంగా వాయిదా

న్యూఢిల్లీ
యెమెన్‌లో కేరళ నర్సు నిమిష ప్రియకు భారీ ఊరట దక్కింది. యెమెన్ ప్రభుత్వం చివరిక్షణంలో ఉరిశిక్ష అమలును వాయిదా వేసింది. ప్రస్తుతం యెమెన్ ప్రభుత్వంతో కేంద్రం చర్చలు కొనసాగుతున్నది. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ఆమెను రక్షించేందుకు ప్రయత్నిస్తుంది. ఎట్టకేలకు ఆ ప్రయత్నాలు ఫలించడంతో బుధవారం అమలు కావాల్సిన ఉరిశిక్ష తాత్కాలికంగా వాయిదా పడింది. ఆమె మరణశిక్ష

-మిగతా 3 లో




## భారత్‌లో అడుగుపెట్టిన టెస్లా

- ముంబైలో తొలి షోరూమ్ ప్రారంభం
- ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సిఎం ఫడ్నవీస్

ముంబై,
టెస్లా కార్లు ఇక భారత రోడ్లపై పరుగెట్టనున్నాయి. ఎంతోకాలంగా అభిమానులు ఎదురు చూస్తున్న ఘడియ వచ్చింది. అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లోకి ప్రవేశించింది. ముంబయిలో తొలి షోరూంను మంగళవారం ప్రారంభించింది. బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని మార్కర్ మ్యాక్సిటీ మాల్‌లో దానిని తెరిచింది. ఈ షోరూం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి

-మిగతా 3 లో

## తెలంగాణకు
# అన్యాయం జరగదు

**కేంద్రానికి రెండు రాష్ట్రాలు సమానమే**

- బనకచర్లపై వాదనలు గట్టిగా వినిపించాలి
- బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు జరిగే నష్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వివరించాలి
- కేంద్ర హోంమంత్రి బండి సంజయ్



కరీంనగర్,
తెలంగాణకు కేందప్రభుత్వం ఎప్పుడూ అన్యాయం చేయదని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఉద్ఘాటించారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో మన తెలంగాణ వాదాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గట్టిగా వినిపించాలని కోరారు. కేంద్రానికి రెండు

-మిగతా 3 లో



## నేటి జలశక్తి మంత్రి భేటీ ఉంటుందా?

- జలవివాదాలపైనే తెలంగాణ ఫోకస్
- బనకచర్లపై ఏపీ ప్రభుత్వం పట్టు
- తెలంగాణ లేఖతో సమస్య జటిలం

న్యూఢిల్లీ/
ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు కేంద్రంపై పరోక్షంగా ఒత్తిడిపెంచి ఒక్కో పనిని సానుకూలం చేసుకుంటున్నారు. ఈక్రమంలో బనకచర్లపై తెలంగాణను ఒప్పించేందుకు కేంద్రంతో భేటీ ఏర్పాటు చేయించారు. ఈ క్రమంలో బనకచర్లపై నేరుగా చర్చ అని చెప్పకుండా జలవివాదాలపై అంటూ..కేంద్రమంత్రి పాటిల్ ఇరు

-మిగతా 3 లో



## ఫ్యూచర్ సిటీ గేమ్ ఛేంజర్

- డీప్యూటి సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్
ఫ్యూచర్ సిటీ తెలంగాణ అభివృద్ధికి గేమ్ ఛేంజర్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మూసీ పునర్జీవనం, రీజనల్ రింగ్ రోడ్డు పూర్తయితే హైదరాబాద్ అభివృద్ధి ఊహకు అందదని ఆయన అన్నారు. తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సమావేశంలో డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఇది ప్రజల ప్రభుత్వం పారిశ్రామికవేత్తలు ఎప్పుడైనా సీఎం రేవంత్ రెడ్డి, యావత్ కేబినెట్, ఉన్నతాధికారులను సంప్రదించవచ్చని అన్నారు.

-మిగతా 3 లో

## ఆహారం బదులు విషం పెడితే రేవంత్ రెడ్డి ఊరుకుంటాడా..?




- వేల మంది విద్యార్థులు కల్తీ ఆహారంతో ఫుడ్ పాయిజన్‌కు గురి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్,
గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం ఆహారం బదులు విషం పెడితే రేవంత్ రెడ్డి ఊరుకుంటాడా?

-మిగతా 3 లో

## స్థానిక ఎన్నికలకు అధికారులు సిద్ధం



- ఖరారైన ఎంపిటిసి, జడ్పీటిసి స్థానాలు
- రిజర్వేషన్ల ప్రకటనతో రానున్న కదలిక

హైదరాబాద్,
ఉమ్మడి జిల్లాలు కనుమరుగు కావడంతో కొత్తా జిల్లాల ఆధారంగా జడ్‌పి ఎన్నికలు జరుగనున్నాయి. పరిషత్ ఎన్నికలే ముందు వస్తాయని అంటున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఒక జిల్లా పరిషత్ స్థానం తగ్గిపోయింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని గ్రామాలు, మండలాలు సమీప మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం కావడంతో 'స్థానిక' ఎన్నికల పక్రియ నుంచి ఈ జిల్లా లేనట్లుగానే అయ్యింది. రాష్ట్రంలో 2019 ఎన్నికల నాటికి 32 జిల్లా పరిషత్‌లు ఉండగా..

-మిగతా 3 లో

# ఢిల్లీలోని ఓ కళాశాల, పాఠశాలకు బాంబు బెదిరింపులు


## అప్రమత్తమైన పోలీసులు



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**
దేశరాజధాని ఢిల్లీలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. నిన్న రెండు పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులే వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఓ కళాశాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి.ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన సెయింట్ స్టీఫెన్స్ కళాశాలకు మంగళవారం ఉదయం ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. అదేవిధంగా ద్వారక ప్రాంతంలోని సెయింట్ థామస్ పాఠశాలకు కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చినట్లు ఢిల్లీ అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. అప్రమత్తమైన కళాశాల, పాఠశాల యాజమాన్యాలు ముందు జాగ్రత్త చర్యగా విద్యార్థులను ఖాళీ చేయించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, అగ్నిమాపక శాఖ బృందం, ప్రత్యేక సిబ్బంది సహా ఎమర్జెన్సీ సర్వీసెస్ టీమ్‌లు హుటాహుటిన ఆ రెండు ప్రదేశాలకు చేరుకొని తనిఖీలు చేపట్టారు. అయితే, ఈ తనిఖీల్లో ఇప్పటి వరకూ ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, సోమవారం కూడా ఢిల్లీలోని రెండు పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఢిల్లీలోని చాణక్యపురి లో గల నేవీ స్కూల్ , ద్వారక ప్రాంతంలోని సీఆర్‌పీఎఫ్ పాఠశాలకు సోమవారం ఉదయం బాంబు బెదిరింపులు వచ్చాయి. రెండు పాఠశాలలకు ఫోన్ చేసిన ఆగంతకులు స్కూల్స్ ఆవరణలో బాంబులు పెట్టినట్లు బెదిరించారు. దీంతో అప్రమత్తమైన పాఠశాలల యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆయా పాఠశాలల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అదంతా బూటకపు బెదిరింపులుగా తేల్చారు. ఇలా వరుస బెదిరింపులతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.


# నేపాల్ సరిహద్దుల్లో రూ.2వేల నోట్ల చెలామణి..!

## ఇన్‌కం ట్యాక్స్ దర్యాప్తులో కీలక విషయాలు..!




**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2వేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. చెలామణి నుంచి పూర్తిస్థాయిలో నోట్లు ఆర్‌బీఐకి చేరలేదు. నేపాల్‌ను ఆనుకొని ఉన్న సరిహద్దు ప్రాంతంలో రూ.2వేల నోట్ల మార్పిడి అక్రమ వ్యాపారం జోరుగా సాగుతున్నది. రూ.2వేల నోట్లు తీసుకొని వాటికి బదులుగా రూ.1200 నుంచి రూ.1600 వరకు ఇస్తున్నట్లు ఆదాయపు పన్నుశాఖ దర్యాప్తులో తేలింది. ఫిబ్రవరి నెలలో నేపాల్ సరిహద్దులోని అనేక ప్రాంతాల్లో లక్నోలోని ఆదాయపు పన్నుశాఖ దర్యాప్తు విభాగం దాడులు చేసి కీలకమైన ఆదేశాలు సేకరించింది. ఈ వ్యవహారంపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నది.సరిహద్దుకు ఇరువైపులా నోట్లను మార్చే ఈ అక్రమ వ్యాపారం జోరుగా జరుగుతోందని ఆదాయపు పన్ను శాఖ అధికారులు పేర్కొంటున్నారు. సరిహద్దులోని రక్సౌల్, రుపైదిహా, బర్హ్ని వంటి ప్రదేశాలకు ఆదాయపు పన్ను శాఖ బృందాలు విచారణ జరుపగా.. నోట్ల మార్పిడి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇందులో ఎక్కువగా నిరుద్యోగ యువకులను వాడుకుంటున్నారని.. ప్రతిగా వారికి కమిషన్ ఇస్తున్నట్లు తేలింది. అయితే, ప్రస్తుతం అధికారులు ఓ నోట్లు ఎక్కడికి పంపుతున్నారో తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ప్రస్తుతం నిబంధనల ప్రకారం రూ.2వేల నోట్లను ఆర్‌బీఐ కార్యాలయాలు, పోస్టాఫీస్‌లలో మాత్రమే డిపాజిట్ చేసేందుకు అవకాశం ఉంది. రూ.30వేల వరకు పరిమితి ఉంది. ప్రస్తుతం ఆదాయపు పన్నుశాఖ నేపాల్ సరిహద్దులో ఉన్న పోస్టాఫీసులపై దృష్టి సారించాయి. గత కొంతకాలంగా రూ.2వేల నోట్లను ఎవరు మార్పిడి చేస్తున్నారో తెలుసుకునేందుకు ఐటీ ప్రయత్నిస్తున్నది. అయితే, నోట్లను మార్చుకునే వ్యక్తులు ఫేక్ ఐడీలను ఉపయోగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అయితే, ఈ విషయంలో సమగ్ర దర్యాప్తు కోసం ఆదాయపు పన్నుశాఖ కొందరు ప్రైవేట్ వ్యక్తులను రూ.2వేల నోట్లతో నేపాల్‌కు పంపింది. అక్కడ వారంతా ఈ నోట్లను సులభంగానే మార్చుకున్నారు. ఆదాయపు పన్నుశాఖ ఈ ఆపరేషన్‌ను గోప్యంగా నిర్వహించారు. కనీసం పోలీసుల సహాయం తీసుకోకపోవడం విశేషం. ఈ దర్యాప్తు సమయంలో నేపాల్ సరిహద్దు ప్రాంతాల్లో వేలాది యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయని ఆదాయపు పన్నశాఖకు సమాచారం అందింది. అక్రమ మసీదులు, మదర్సాలు, సమాధులను నిర్మించేందుకు అక్రమ మత మార్పిడిలకు దీన్ని ఉపయోగిస్తున్నారని.. తమిళనాడుకు చెందిన ఓ సంస్థ నిధులు సమకూరుస్తున్నట్లుగా సమాచారం.

# గోల్డెన్ టెంపుల్‌కు బాంబు బెదిరింపు



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**
పంజాబ్ లోని గోల్డెన్ టెంపుల్‌కు బాంబు బెదిరింపు మెయిల్స్ రావటం తీవ్ర కలకలం సృష్టించింది. టెంపుల్లో బాంబు పెట్టినట్లు అధికారులకు మంగళవారం ఈమెయిల్స్ వచ్చింది. ఈ తరహా ఈ మెయిల్స్ రావడంతో ఇది రెండోసారి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. టెంపుల్ పరిసర ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు గాలింపు చేపట్టాయి. ఈ బెదిరింపు మెయిల్‌పై శిరోమణి గురుద్వార్ ప్రబంధక్ కమిటీ ఆ రాష్ట్ర సీఎంతో పాటు డీజీపికి లేఖ రాసింది. ఆగంతకులను గుర్తించి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ఆలయానికి అదనపు రక్షణ కల్పించాలని పేర్కొన్నారు.ఇదిలా వుండగా దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రముఖ స్కూళ్లలో, విమానాశ్రయాల్లో బాంబులు అమర్చినట్లుగా తరచూ బెదిరింపులకు పాల్పడుతూ ఈమెయిల్స్ రావటం ఎక్కువయ్యాయి. ముంబైలోని బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ భవనానికి బాంబు పెట్టినట్లు అధికారులకు మంగళవారం కామ్రేడ్ పినరయి విజయన్ పేరుతో ఈమెయిల్ వచ్చింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు.మరోవైపు దేశ రాజధానిలోని ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన సెయింట్ స్టీఫెన్స్ కాలేజ్‌లకు, సెయింట్ థామస్ స్కూల్‌కు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ముందు జాగ్రత్త చర్యగా విద్యార్థులను ఖాళీ చేయించి.. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు గాలింపు చేపట్టాయి. కాగా, ఇటీవల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధికారిక నివాసానికి సైతం బాంబు బెదిరింపు వచ్చిన విషయం తెలిసిందే.

# కెనడాలో జగన్నాథ రథయాత్రపై కోడిగుడ్లు

**టొరంటో ప్రజా స్వేచ్ఛ**
కెనడాలోని టొరంటోలో శ్రీ జగన్నాథుని రథయాత్రపై దాడి జరిగింది. భక్తి పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ వీధిలో వెళ్తున్న భక్తులపైకి ఓ భవనంపై నుంచి కోడి గుడ్లు విసిరారు. దీనిపై భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందిస్తూ, ఇది అత్యంత హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ, ఇటువంటి హేయమైన చర్యలు పండుగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు.ఈ పండుగ ఐకమత్యం, అందరినీ కలుపుకొనిపోవడం, సామాజిక సామరస్యాలను పెంపొందిస్తుందని తెలిపారు. ఈ దాడికి పాల్పడినవారిని చట్టానికి జవాబుదారీ చేయాలని కెనడా అధికారులను కోరినట్లు చెప్పారు. కెనడా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రణాళిక ప్రకారమే పహల్గాం ఉగ్రదాడి..

## షాంఘై సమావేశంలో జైశంకర్




**టియాంజిన్ ప్రజా స్వేచ్ఛ**
ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం అనేవి మూడు దుష్టశక్తులని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడి అంశాన్ని మంగళవారంనాడిక్కడ జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సమావేశంలో ఆయన ప్రస్తావించారు. ఈ మూడు దుష్టశక్తులపై పోరాటం జరపడం ఎస్‌సీఓ ఏర్పాటు లక్ష్యాల్లో ఒకటని గుర్తుచేశారు.ఏప్రిల్ 22 భారత్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడిని ప్రపంచమంతా చూసిందని, జమ్మూకశ్మీర్‌లో పర్యాటక రంగాన్ని, ఆర్థిక వ్యవస్థను దెబ్బకొట్టి, మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు ఉద్దేశపూర్వకంగా జరిపిన దాడి ఇదని జైశంకర్ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి కూడా ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండించిందని చెప్పారు. ఉగ్రవాదానికి పాల్పడుతూ, ప్రోత్సహిస్తున్న శక్తులను చట్టం ముందుకు తీసుకురావాలనే ఇండియా దృఢ సంకల్పాన్ని యూఎన్ పునరుద్ఘాటించిందని అన్నారు. ఉగ్రవాదం విసురుతున్న సవాళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడమనే సందేశం ఎస్‌సీఓ సమావేశం బలంగా నొక్కిచెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు.ఆఫ్ఘనిస్థాన్ సుస్థిరత, సంక్షేమం కోసం భారత్ చిరకాలంగా కట్టుబడి ఉందని, ఆఫ్ఘన్ అభివృద్ధికి ఎస్‌సీఓ సభ్యదేశాలు మరింత సహకారం అందించాలని జైశంకర్ సూచించారు. గ్లోబల్ అఫైర్స్‌లో తమ ప్రభావాన్ని విస్తరించుకునేందుకు సభ్యదేశాలు సమష్టిగా షేర్డ్ ఎజెండాతో ముందుకు వెళ్లాలని అన్నారు. సమష్టి సామర్థ్యంతోనే ఎస్‌సీఓ విజయాలు సాధిస్తుందన్నారు. ఆర్థిక సహకారం కూడా చాలా కీలకమని, ఎస్‌సీఓ ప్రాంతంలో రవాణా మార్గాలు లేకపోవడం వంటి అవరోధాల కారణంగా వాణిజ్యం, ఇన్వెస్ట్‌మెంట్‌పై ప్రభావం చూపుతుందన్నారు. ఇంటర్నేషనల్ నార్త్-సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్ ని ప్రమోట్ చేసేందుకు రెట్టించిన ఉత్సాహంతో సభ్యదేశాలు దృష్టి సారించాలని సూచించారు.


# కేరళలో జపనీస్ ఎన్‌సెఫలైటిస్ కలకలం..

## 26 కు పెరిగిన మృతుల సంఖ్య..!



**కేరళ ప్రజా స్వేచ్ఛ**
కేరళ లో జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వ్యాధి కలకలం రేపుతోంది. గడిచిన వారం రోజులలో ఈ వ్యాధి బారినపడి 12 మంది ప్రాణాలు కోల్పోయారు. దాంతో ఈ ఏడాది ఇప్పటివరకు జపనీస్ ఎన్‌సెఫలైటిస్ బారినపడి మరణించిన వారి సంఖ్య 26కు పెరిగింది. కేరళ ప్రభుత్వ వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి.కేరళలోని మొత్తం 35 జిల్లాలకుగాను 33 జిల్లాలో జపనీస్ ఎన్‌సెఫలైటిస్ ప్రభావం చూపుతోంది. కేవలం దిమా హసావో, హెయిలకండి జిల్లాల్లో మాత్రమే ఆ వ్యాధి ప్రభావం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో కేరళ ప్రభుత్వం అన్ని జిల్లాల ఆరోగ్య శాఖ అధికారులను అప్రమత్తం చేసింది. దేశంలోని మొత్తం జపనీస్ ఎన్‌సెఫలైటిస్ కేసులలో ఒక్క కేరళలోనే 50 శాతం ఉన్నాయని తెలిపింది.ప్రస్తుతం రాష్ట్రంలో 300 జపనీస్ ఎన్‌సెఫలైటిస్ కేసులు ఉన్నాయని కేరళ ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈ వ్యాధి 10 లోపు పిల్లలపై, 60 ఏళ్ల పైబడిన వృద్ధులపై ఎక్కువ ప్రభావం చూపుతుందని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.


# ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నగరంగా సింగపూర్



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**
జూలియస్ బేర్ వార్షిక నివేదిక ప్రకారం.. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నగరంగా సింగపూర్ నిలిచింది. వరుసగా మూడో ఏడాది ఈ ఘనతను సింగపూర్ దక్కించుకోవడం విశేషం. మరోవైపు రెండో స్థానంలో ఉన్న హాంగ్‌కాంగ్‌ను పక్కకు నెట్టి ఆ స్థానాన్ని లండన్ కైవసం చేసుకుంది. హాంగ్‌కాంగ్ మూడో స్థానానికి పరిమితమైంది. కనీసం 1 మిలియన్ డాలర్ల బ్యాంక్ బ్యాలెన్స్ కలిగిన వ్యక్తులు కొనుగోలు చేస్తున్న వివిధ రకాల ఉత్పత్తులు, వారు అనుభవిస్తున్న విలాసాల ఆధారంగా.. వారి జీవన వ్యయాన్ని జూలియస్ బేర్ లైఫ్‌స్టైల్ ఇండెక్స్ విశ్లేషించి.. ఈ నివేదికను తయారు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి- మార్చి మధ్య డేటాను పరిగణనలోకి తీసుకున్నట్లు జూలియస్ బేర్ వెల్లడించింది.

**టాప్ 10 ఖరీదైన నగరాలు ఇవే:**
సింగపూర్ 2. లండన్ 3. హాంగ్‌కాంగ్ 4. షాంఘై 5. మొనాకో 6. జ్యూరిచ్ 7. న్యూయార్క్ 8. పారిస్ 9. సావో పాలో 10. మిలాన్.

# ట్రంప్ 100శాతం సుంకాలపై రష్యా కౌంటర్



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**
ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించకుంటే 100శాతం సుంకాలు విధిస్తామన్న అమెరికా అధ్యక్షులు ట్రంప్ బెదిరింపులపై రష్యా మంగళవారం స్పందించింది. రష్యా ఎగుమతుల కొనుగోలుదారులపై ఆంక్షలు, బెదిరింపులు సహా అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఇటీవలి ప్రకటనలు తీవ్రమైనవి, విశ్లేషణ అవసరమని రష్యా ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. "ట్రంప్ ప్రకటనలు చాలా తీవ్రమైనవి. వాటిలో కొన్ని తమ అధ్యక్షుడు పుతిన్‌ను వ్యక్తిగతంగా ఉద్దేశించి చేసినవి. ట్రంప్ ప్రకటనను విశ్లేషించేందుకు కొంత సమయం అవసరం. పుతిన్ కచ్చితంగా స్పందిస్తారు" అని అన్నారు. ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలు పంపిణీ చేస్తామని ట్రంప్ సోమవారం హెచ్చరించిన సంగతి తెలిసిందే.ఈ ప్రకటనపై కూడా డిమిత్రి స్పందిస్తూ.. వాషింగ్టన్, నాటో దేశాల్లో ముఖ్యంగా బ్రస్సెల్స్‌లో తీసుకుంటున్న నిర్ణయాలను ఉక్రెయిన్ నుండి శాంతికి సంకేతంగా కాకుండా యుద్ధాన్ని కొనసాగించేందుకు సంకేతంగా భావిస్తోందని అన్నారు. ఉక్రెయిన్‌తో ప్రత్యక్షంగా చర్చలు జరిపేందుకు రష్యా సిద్ధంగా ఉందని, తదుపరి చర్చలు ఎప్పుడపు జరగవచ్చనే అంశంపై ఉక్రెయిన్ నుండి సంకేతం కోసం తాము వేచి చూస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు.

## కేరళ నర్సు నిమిష ప్రియ మరణశిక్ష వాయిదా..!

(మొదటి తరువాయి)

అమలును యెమెన్ వాయిదా వేసినట్లు భారత విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. గతంలో నిర్ణయించిన ప్రకారం.. జులై 16న ఈ శిక్ష అమలుచేయాల్సి ఉండగా.. చివరి క్షణంలో స్థానిక అధికారులు దీన్ని నిలిపివేసినట్లు- సమాచారం. ఈ కేసు మొదలైనప్పటి నుంచి నిమిష ప్రియకు అన్నివిధాలా సాయం చేసేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తూనే ఉంది. నిమిష కుటుంబం.. బాధిత కుటుంబం పరస్పర అంగీకారానికి వచ్చి కేసును పరిష్కరించుకునేలా కొంత సమయం ఇచ్చేలా ప్రయత్నాలు చేశాం. స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్ ఆఫీసుతో నిరంతరం సంప్రదింపులు జరిపాం. అవి ఫలించి మరణశిక్ష అమలును వాయిదా వేసేందుకు యెమెన్ అధికారులు అంగీకారం తెలిపారని విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో బ్లడ్ మనీ తీసుకునేలా బాధిత కుటుంబాన్ని ఒప్పించేందుకు మత గురువు కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ సంప్రదింపులు జరిపిన సంగతి తెలిసిందే. ఆ చర్చలు కూడా సానుకూలంగా జరుగుతున్నట్లు సమాచారం. బాధిత కుటుంబానికి ఒక మిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.6కో) క్షమాధనాన్ని ఇచ్చేందుకు నిమిష ప్రియ కుటుంబం సిద్ధమైంది. ఇందుకు వారు అంగీకరిస్తే.. నిమిష ప్రియకు మరణశిక్ష తప్పే అవకాశం ఉంది. ఉరికి కేవలం కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉన్న క్రమంలో మోడీ సర్కార్ చేసిన ప్రయత్నాలు ఫలించి ఉరితీతు తాత్కాలికగా వాయిదా వేశారు. నిమిష కుటుంబం మాత్రం నిమిషను రక్షించుకోవడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఉన్న ఒకదారి అగమ్యగోచరంగా మారింది. హతుడి కుటుంబం అడిగినంత డబ్బు ఇవ్వగలిగితే.. చివరి నిమిషంలోనైనా నిమిషకు ఉరి తప్పే అవకాశం ఉంది. కొన్ని నెలల క్రితమే నిమిష ప్రియ కుటుంబం బ్లడ్ మనీ కింద 10 లక్షల డాలర్లు సిద్ధం చేసుకుంది. అయితే, నిమిష కుటుంబానికి, హతుడి కుటుంబానికి మధ్యవర్తిత్వం వహించిన లాయర్ దెబ్బ కొట్టాడు. పెద్ద మొత్తంలో ఫీజు డిమాండ్ చేశాడు. తన ఫీజు చెల్లించే వరకు బ్లడ్ మనీ చర్చలు జరపనని తేల్చి చెప్పాడు. దీంతో ఎప్పుడో పూర్తి కావాల్సిన బ్లడ్ మనీ వాయిదా పడింది.

## తెలంగాణకు అన్యాయం జరగదు

(మొదటి తరువాయి)

రాష్ట్రాలు సమానమేనని నొక్కిచెప్పారు. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు జరిగే నష్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వివరించాలని సూచించారు. మంగళవారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించారు. పలు కార్యక్రమాల్లో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం చేసే అన్యాయాన్ని బీసీ సంఘాలు ఎందుకు ప్రశ్నించడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన సమగ్ర సర్వేలో బీసీలు 51 శాతం.. కాంగ్రెస్ సర్వేలో మాత్రం 46 శాతమా అని ప్రశ్నించారు. బీసీల్లో ముస్లింలను కలపడం ఏంటని నిలదీశారు. బీసీలకు మిగిలేది కేవలం ఐదు శాతమేనని చెప్పుకొచ్చారు. బీసీ ఆర్డినెన్స్‌ను తాము వ్యతిరేకించమని స్పష్టం చేశారు. బీసీల్లో ముస్లింలను కలిపితే ఆ ఆర్డినెన్స్‌ను మాత్రం అడ్డుకుంటామని హెచ్చరించారు. బీసీలను రేవంత్ ప్రభుత్వం మోసం చేస్తోందని.. ఈ మోసంపై బీసీ సంఘాలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీసీల్లో ముస్లింలను కలిపితే.. కేంద్రప్రభుత్వం ఆమోదం తెలపదని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.

## స్థానిక ఎన్నికలకు అధికారులు సిద్ధం

(మొదటి తరువాయి)

తాజాగా 31 జెడ్.పీ.లకు మాత్రమే ఎన్నికలు జరగనున్నాయి. 2019లో రాష్ట్రవ్యాప్తంగా 539 ఎంపీపీలు, జెడ్పీటీసీలకు ఎన్నికలు జరిగినా.. ప్రస్తుతం వాటి సంఖ్య 566 స్థానాలకు చేరింది. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 33 స్థానాలు, అత్యల్పంగా ములుగు జిల్లాలో 10 ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలున్నాయి. కాగా, ప్రభుత్వం నుంచి ఎప్పుడు ప్రకటన వచ్చినా.. స్థానిక ఎన్నికల నిర్వహణకు రెడీగా ఉన్నట్లు పంచాయితీరాజ్ అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు- చేస్తున్నట్లు తెలిపారు. ఇకపోతే రాష్ట్రంలో ఎంపీటీసీ స్థానాల లెక్క తేలింది. అంతకు ముందు 5,817 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 5,773కు తగ్గింది. గతం కంటే 44 ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. 566 ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 71 గ్రామ పంచాయతీలు జీహెచ్ఎంసీ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో కలవడంతో భారీగా మార్పులు చోటుచేసుకున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లాల్లోని పంచాయతీలు మున్సిపాలిటీలలో విలీనం కావడంతో దీని ప్రభావం ఎంపీటీసీ స్థానాలపై పడింది. పంచాయతీ రాజ్‌శాఖ డీనోటిఫైడ్ చేసిన తర్వాత ఎంపీటీ-సీ స్థానాలు తగ్గినట్లు- అధికారులు పేర్కొన్నారు. కాగా, తాజాగా సంగారెడ్డి జిల్లాలో ఇంద్రేశం, జిన్నారం కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ రెండింటి పరిధిలో దాదాపు 18 గ్రామ పంచాయతీల వరకు ఉంటాయి. అవి పూర్తిస్థాయిలో మున్సిపాలిటీలలో కలిస్తే ఇప్పుడున్న ఎంపీటీసీల సంఖ్యలో స్వల్ప మార్పులు చోటు-చేసుకోనున్నాయి. దీంతో రాష్ట్రంలో మళ్లీ ఎంపీటీసీ స్థానాల సంఖ్య తగ్గే చాన్స్ ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## భారత్‌లో అడుగుపెట్టిన టెస్లా

(మొదటి తరువాయి)

దేవేంద్ర ఫడణవీస్ హాజరయ్యారు. భారత్‌లో తొలిగా ముంబైలో అడుగుపెట్టిన ఈ సంస్థకు ఘనంగా స్వాగతం చెప్పారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం దేవేంద్ర ఫడణవీస్ మాట్లాడుతూ టెస్లా సరైన రాష్ట్రం, నగరాన్ని ఎంచుకుంది. ఈ కంపెనీ కార్ల డిజైన్, ఇన్నోవేషన్‌పై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఉంటుంది. 2015లో అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు తొలిసారి టెస్లా కారులో తిరిగానని ఫడణవీస్ అన్నారు. టెస్లా దీర్ఘకాలిక ప్రణాళికల గురించి ఎన్నో ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ.. ప్రస్తుతానికి స్థానికంగా దీని తయారీపై ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. భారత్‌లో ఈ ఎలక్ట్రిక్ కార్ల తయారీకి సంబంధించిన భవిష్యత్ ప్రణాళికలపై ఆశాభావం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా 'మోడల్ వై' కారును సంస్థ ఆవిష్కరించింది. తొలుత 'మోడల్ వై' ఈవీలను -టె-స్లా భారత్ మార్కెట్లో విక్రయించనుంది. ఇక్కడ ఆర్‌డబ్ల్యూడీ వెర్షన్ (బేస్) 'మోడల్ వై' ఆన్‌రోడ్ ధర రూ.61.07 లక్షలుగా నిర్ణయించింది. లాంగ్‌రేంజ్ వెర్షన్ ధర రూ.69.15లక్షలుగా ఉంది. బేస్ మోడల్ ధర అమెరికాలో 44,990 డాలర్లు (రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్లు (రూ.31.57లక్షలు) జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09లక్షలు)గా ఉంది. దిగుమతి సుంకాలు, రవాణా ఖర్చుల కారణంగా భారత్‌లో దీని ధర ఎక్కువగా ఉంది. కొన్నిరోజుల క్రితం భారత రోడ్లపై 'మోడల్ వై' ను పరీక్షించిన సంగతి తెలిసిందే. ముంబయి-పుణే జాతీయరహదారిపై ఈ వాహనం దర్శనమివ్వడం చూపరులను ఆకర్షించింది. ఇది పూర్తిగా అప్‌డేట్ అయిన మోడల్ కారుగా నిపుణులు గుర్తించారు. దీని కోడ్‌నేమ్ జునిపెర్. అడ్వాన్స్‌డు వర్షన్‌ను అమెరికా, కెనడా మార్కెట్లలో వీటిని విక్రయిస్తున్నారు. దీని సీ షేప్‌లోని ఎల్ఈడీ లైట్లు-, ట్విన్ స్పోక్ అలాయ్ వీల్స్, -టె-స్లా ప్రత్యేకతను తెలిపే గ్లాస్ రూఫ్ ఉన్నాయి. ఇది భారత్‌లో ఆరు రంగుల్లో లభించవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మోడల్ వై కారు ఆల్‌వీల్ డ్రైవ్‌గా లభిస్తోంది. వీటిల్లో లాంగ్ రేంజ్ బ్యాటరీ ప్రత్యేకత. ఒక్కసారి ఛార్జి చేస్తే 500-600 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. కేవలం 4.6 సెకన్లలో గంటకు 0-96 కిలోమీటర్ల వేగాన్ని అందుకొంటుంది. అత్యధికంగా గంటకు 200 కి.మీ. వేగంతో ప్రయాణించగలదు. దీనిలో భారీ 15.4 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను అమర్చారు. వెనక సీట్లలోని ప్యాసింజర్ల కోసం 8 అంగుళాల ప్రత్యేకమైన స్క్రీన్ కూడా ఉంటు-ంది. అడాస్ ఫీచర్లు, వైర్‌లెస్ ఫోన్ ఛార్జింగ్ వంటి హంగులు ఇందులో కస్టమర్లకు లభించనున్నాయి.

## ఆహారం బదులు విషం పెడితే రేవంత్ రెడ్డి ఊరుకుంటాడా..?

(మొదటి తరువాయి)

అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ఏడాది కాలంలో వేల మంది విద్యార్థులు కల్తీ ఆహారంతో ఫుడ్ పాయిజన్‌కు గురవడం, వంద మందికి పైగా విద్యార్థులు చనిపోవడం ప్రభుత్వ పూర్తిస్థాయి వైఫల్యం అని కేటీఆర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి దీనికి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనలు జరిగిన తరువాత కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం రేవంత్ నియంతృత్వ అమానవీయ పాలనకు నిదర్శనం. రేవంత్ రెడ్డి ఇంత మంది విద్యార్థులు అనారోగ్యం పాలైనా, ఆత్మహత్యలు చేసుకున్నా, మరణాల పాలయ్యినా పట్టించుకోకపోవడం నేరపూరిత నిర్లక్ష్యం అని కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురుకుల విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజనింగ్, మరణాల అంశాన్ని ప్రభుత్వ దృష్టికి అనేకసార్లు తీసుకువచ్చా. ఈ అంశాన్ని మేము ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన ప్రతిసారి మంత్రులు కంటి తుడుపు చర్యలతో పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని కేటీఆర్ తెలిపారు. ఎన్నిసార్లు చెప్పినా ప్రభుత్వం ఈ విషయంలో పట్టించుకోలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇంతటి అమానవీయ సంఘటనలపై చర్యలు తీసుకోవాలి. రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఒక్క సమీక్ష చేయడానికి కూడా సమయం కేటాయించలేకపోయారని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. పిల్లలు కలిగిన ఒక తండ్రిగా అడుగుతున్నా. ఈ అంశంలో ముఖ్యమంత్రిగా కాకుండా కనీసం ఒక తండ్రిగా అయినా రేవంత్ రెడ్డి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నా. తన పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం ఆహారం బదులు విషం పెడితే ముఖ్యమంత్రి ఊరుకుంటాడా? అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. ఇదే పరిస్థితి రేవంత్ రెడ్డి పిల్లలకు జరిగితే కూడా ఇలానే వదిలేస్తారా? అని ప్రశ్నించారు. దయచేసి రేవంత్ రెడ్డి ఈ అంశాన్ని గంభీరంగా ఆలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నా. రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంతో మన కుటుంబసభ్యులు, మీ కుటుంబసభ్యులు నష్టపోతే మీరు ఊరుకుంటారా? మీ పిల్లలకు ప్రభుత్వం విషం కలిపిన ఆహారం పెడితే మౌనంగా ఉంటారా? ఇన్ని దారుణాలు జరుగుతున్నా బాధ్యత ఎవరిది? ముఖ్యమంత్రి గతంలో అన్నట్లే ఇప్పుడు ఎవరు బాధ్యులు? ఎవరినీ ఉరితీయాలో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## దివి నుంచి భువికి శుభాంశు శుక్లా

(మొదటి తరువాయి)

తెలిపారు. అంతరిక్ష పరిశోధన కేంద్రంలో అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా రికార్డు సృష్టించారు. కాగా, భూమిపైకి చేరుకున్న ఈ వ్యోమగాయుల బృందాన్ని ఏడు రోజుల పాటు క్వారెంటైన్‌లో ఉంచనున్నట్లు స్పేస్ ఎక్స్ అధికారులు తెలిపారు. శుభాంశు శుక్లా బృందం భూమికి సురక్షితంగా చేరుకోవడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఐఎస్ఎస్‌ను సందర్శించిన తొలి భారతీయ వ్యోమగామిగా చరిత్ర సృష్టించిన శుభాంశు.. పట్టుదల, అంకితభావం, సాహస చర్యల ద్వారా కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలిచారని ఎక్స్ వేదికగా కొనియాడారు. ఇది మన సొంత మానవ సహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్‌కు దిక్సూచిగా నిలుస్తుందన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో పలు పరిశోధనలు చేపట్టిన యాక్సియం-4 మిషన్ బృందం.. స్పేస్‌ఎక్స్‌కు చెందిన క్రూ డ్రాగన్ గ్రేస్ వ్యోమనౌకలో సోమవారం బయలుదేరింది. భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ-విస్నియెస్కీ, టిబర్ కపులు ఈ బృందంలో ఉన్న సంగతి తెలిసిందే. ఇకపోతే శుభాంశు శుక్లా తిరిగి భూమికి చేరుకోవడంపై సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. ఆయన తిరిగి భూమికి వచ్చిన సందర్భంగా స్వస్థలం లక్నోలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయన తల్లిదండ్రులు భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నారు.

## బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్

(మొదటి తరువాయి)

యూనిట్ కు సిఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలోనే 33 శాతం వ్యాక్సిన్స్ , బల్క్ డ్రగ్స్‌లో 43 శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయని నొక్కిచెప్పారు. కోవిడ్ సమయంలో జీనోమ్ వ్యాలీ నుంచే ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్‌ను ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలదని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగానే ప్రభుత్వాల నిర్ణయాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం మరింత సరళమైన విధానాలతో ముందుకెళ్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ డేటా సిటీగా మారనుందని ఉద్ఘాటించారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 3లక్షల 28 వేల కోట్లు పెట్టుబడులు సాధించామని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలతో పోటీ- పడాలని, అధునాతన విధానాలను తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే పదేళ్లలో తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని నొక్కిచెప్పారు. ఇందుకు జీనోమ్ వ్యాలీ పారిశ్రామికవేత్తల సహకారం ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. జీనోమ్‌వ్యాలీ ఆసియా ఖండంలోనే ప్రత్యేకమైందిగా గుర్తింపు పొందిదన్నారు. జీవ శాస్త్రాల అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ హైదరాబాద్‌లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.

## నల్గొండను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలపాలి

(మొదటి తరువాయి)

చేశారు. మూడు దశాబ్దాలుగా ఉమ్మడి నల్గొండ ప్రజలు తనను ఆశీర్వదిస్తూ వస్తున్నారని,వారి ఉన్నతి కోసం ఎంత చేసిన తక్కువే అని మంత్రి పేర్కొన్నారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధి,మహాత్మా గాంధీ యూనివర్సిటీ-,కాలేజీ,స్కూల్ ఎడ్యుకేషన్ పై ఆ శాఖ ఉన్నతాధికారుతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయమని దాని ఖ్యాతిని పెంచేలా వీసీ,రిజిస్ట్రార్ ,పాలక సభ్యులు పనిచేయాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. యూనివర్శిటీకి ప్రత్యేకంగా 60.22 కోట్ల గ్రాంట్ మంజూరు చేశామని,ఇన్ఫ్రా డెవలప్మెంట్ చేస్తున్నందున కొత్త కోర్సుల పై ఆరా తీశారు. విశ్వవిద్యాలయంలో కొత్తగా ఫార్మసీ,ఎల్ ఎల్ బి,ఎల్ ఎల్ ఎం లాంటి కోర్సులు ప్రారంభించేందుకు చొరవ చూపాలని వీసీ అల్తాఫ్ హుస్సేన్ మంత్రిని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి సహకారంతో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తేవడానికి అన్ని విధాల ప్రయత్నిస్తు న్నామని అందుకే ఇంత బిజీ షెడ్యూల్లో కూడా విద్యా శాఖ ఉన్నతాధికారులు ఈ సమీక్షకు వచ్చారన్నారు. నల్గొండలో యూనివర్సిటీ- కాలేజ్ ఆఫ్ ఫార్మసి,లా కాలేజీ ఏర్పాటు-చేయాలనేది నా చిరకాల కోరికనీ అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టామని త్వరలో నూతన కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని కాలేజ్,స్కూల్ ఎడ్యుకేషన్ కు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. డిగ్రీ,జూనియర్ కాలేజీల్లో మౌళిక సదుపాయాలు..హై స్కూల్స్ బలోపేతంపై చర్చించి,అందుకు విద్యాశాఖ అధికారులు అందించాల్సిన సహకారం పై పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి ప్రభుత్వ కాలేజీలు,స్కూల్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిపై చర్చిస్తానని చెప్పారు. ఈ సమీక్షలో విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా,సాంకేతిక,ఉన్నత విద్యా మండలి కమిషనర్ దేవసేన,మహాత్మగాంధీ యూనివర్సిటీ- వీసీ అల్తాఫ్ హుస్సేన్,రిజిస్ట్రార్ రవి తదితరులు పాల్గొన్నారు.

## నేటి జలశక్తి మంత్రి భేటీ ఉంటుందా?

(మొదటి తరువాయి)

రాష్ట్రల సిఎంల భేటీకి నేడు ఆహ్వానించారు. అయితే ఈ ఎత్తుగడను ముందే పసిగట్టిన తెలంగాణ ఈ భేటీలో జలవివాదాలు తప్ప బనకచర్లపై చర్చుండరాదని మెలికపెట్టి లేఖ రాసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారంలో కృష్ణా, గోదావరి జలాల గురించి మాత్రమే చర్చించాలని కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇది చేయకుండా కేవలం బనకచర్లపై చర్చించడం కుదరదని తేల్చిచెప్పింది. దీంతో కేంద్రం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను చర్చకు ఆహ్వానించిన క్రమంలో ఈ సమావేశం ఉంటుందా లేదా అన్నది అనుమానంగా మారింది. ఇరు రాష్ట్రాల మధ్యజలవివాదాల పరిష్కారం కోసం అంటూ బుధవారం తెలంగాణ, ఎపి సిఎంలు కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కేంద్రానికి తెలంగాణ సర్కార్ లేఖ రాసింది. సమావేశంలో బనకచర్లపై చర్చించాలని ఎపి సింగిల్ ఎజెండా ఇచ్చింది. అయితే నేటి భేటీలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం తన లేఖలో పేర్కొంది. కృష్ణాపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులను ప్రభుత్వం అజెండాగా ప్రతిపాదించింది. పాలమూరు, డిండి ప్రాజెక్టులకు జాతీయహోదాను ప్రభుత్వం అజెండాగా పంపించింది. ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని ప్రభుత్వం కోరింది. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ నుంచి తెలుగు రాష్టాల సీఎంలకు పిలుపు వచ్చిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఏపీ ఇచ్చిన బనకచర్ల అజెండాపై అభ్యంతరం తెలిపింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే నేటి సమావేశంలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయమై ఆంధప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలతో కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఈ నెల 16న బుధవారం సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ మేరకు జలశక్తిశాఖ ఇరు రాష్ట్రాలసీఎంల కార్యాలయాలు, సీఎస్‌లకు సమాచారం పంపించింది. దిల్లీలోని జలశక్తిశాఖ ప్రధాన కార్యాలయం శ్రమశక్తి భవన్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం జరుగుతుంది. ఈ అంశంతోపాటు- రాష్ట్రాల తరపున మాట్లాడాల్సిన ఇతర ఎజెండా పాయింట్లు- ఏమైనాఉంటే వెంటనే పంపాలని జలశక్తిశాఖ కోరింది. సమావేశంలో బనకచర్లపై చర్చించాలని ఏపీ ప్రభుత్వం సింగిల్ అజెండా ఇచ్చింది. వాస్తవానికి ఈ నెల 11న సమావేశం నిర్వహించాలని నిర్ణయించి ముఖ్యమంత్రుల సమయం కోరినా, సానుకూల స్పందన రాకపోవడంతో 16వ తేదీకి వాయిదావేశారు. ఈ తేదీన హాజరుకావడానికి ఇద్దరు ముఖ్యమంత్రులు అంగీకరించినట్లు- తెలిసింది. కృష్ణా నదిపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులను అజెండాగా ప్రతిపాదించింది. పాలమూరు, దిండి ప్రాజెక్టులకు జాతీయహోదా, ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని, తుమ్మడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీలు కేటాయించాలని అజెండాగా పంపించింది. 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవని, చట్టాలు, -ట్రిబ్యునల్ తీర్పుల ఉల్లంఘన జరుగుతోందని లేఖలో ప్రస్తావించింది. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చించడం అనుచితమని పేర్కొంది. ఇలాంటి చర్యలతో కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థలపై నమ్మకం పోతుందని తెలిపింది. ఏపీ పునర్విభజన చట్టం మేరకు కొత్త ప్రాజెక్టులు, జల వివాదాలకు సంబంధించిన అంశాలను కేంద్ర జలశక్తి మంత్రి ఛైర్మన్‌గా, రెండు రాష్ట్రాల సీఎంలు సభ్యులుగా గల ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించాల్సి ఉంది. గత పదేళ్లలో రెండు సమావేశాలు జరిగాయి. ఇటీవల ఏపీ ప్రభుత్వం గోదావరి వరద జలాలను వినియోగించుకొనేందుకు బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఇప్పటికే దిల్లీలో కేంద్రమంత్రిని కలిసి అభ్యంతరం వ్యక్తంచేశారు. పర్యావరణ అనుమతులు, కేంద్ర జలసంఘం నుంచి అనుమతులు ఇవ్వొద్దంటూ లేఖలు రాశారు.

## ఫ్యూచర్ సిటీ గేమ్ ఛేంజర్

(మొదటి తరువాయి)

మా ప్రభుత్వ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, పెండింగ్ పవర్ బిల్లుల వన్ టైం సెటిల్మెంట్ గురించి ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ప్రభుత్వం పరిశ్రమలు పౌర సమాజం అంతా కలిసి పని చేద్దాం.. హైదరాబాదులో సృష్టించే సంపదను రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తీసుకెళ్దామని, సంపద సృష్టించడం ఒక సాధన మాత్రమే మన ప్రజల గౌరవాన్ని పెంపొందించడం వారి ఆశయాలను నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యమన్నారు భట్టి విక్రమార్క. తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కి వందేళ్ల పైగా అనుభవం ఉందని, హైదరాబాద్ నగరం ఒక వర్తక నగరం నుంచి ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగే వరకు ప్రతి దశలోనూ ముందు నడిచిందన్నారు.

# సంపాదకీయం

## బిసి రిజర్వేషన్లు... స్థానిక ఎన్నికల సమరం !

బిసి రిజర్వేసన్లు, స్థానిక ఎన్నికల చుట్టూ ఇప్పుడు తెలంగాణ రాజకీయం కేంద్రీకృతం అయ్యింది. ఈ వ్యవహారంలో అధికార కాంగ్రెస్ రెండాకులు ఎక్కువే చదివింది. రాజకీయాలను తనకు అనుకూలంగా మార్చుకుని కులగణన చేపట్టిన, బిసి రిజర్వేషన్లకు ఆర్డినెన్స్ ప్రతిపాదించింది. బిసిల ఉద్యమాన్ని నెత్తికెత్తుకునే క్రమంలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. ఎందుకంటే పదేళ్లు అధికారంలో ఉండగా ఏనాడు కనిపించని నిఆదం కాంగ్రెస్ రాగానే అందుకుంటే ఫలితం ఇవ్వలేదు. ఇది కేవలం రాజకీయ ఎత్తుగడగా ప్రజలకుకూడా అర్థం అయ్యింది. మొత్తంగా ఇప్పుడు బిసి రిజర్వేషన్ల పేటెంట్ కాంగ్రెస దక్కించుకుంది. దీనిని ప్రధాన ఎజెండగా చేసుకుని అడుగులు వేస్తోంది. విపక్ష పార్టీలకు సవాళ్లు విసురుతోంది. అయితే స్థానిక ఎన్నికల్లో ఈ రిజర్వేషన్ల అమలు అంత సులువు కాదు. సెప్టెంబర్‌లోగా ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అటు రిజర్వేషన్ల అమలు లో వేగం పెంచింది. ఇటీవలే కేబినేట్‌లో ఆర్డనెన్స్ తెచ్చేందుకు ఆమోదించింది. కొత్తగా రేషన్ కార్డులు జారీ ప్రక్రియను వేగం చేసింది. అలాగే సన్నబియ్యం, రైతుభరోసా వంటి కార్యక్రమాలు చేసింది. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కేబినెట్ తీర్మానం చేయడంతో అందరి దృష్టి స్థానిక సంస్థలపై పడింది. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి సంవత్సరన్నరపైగా కావడం, పరిషత్‌ల గడువు ముగిసి సంవత్సరం పూర్తవుతుండటంతో ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే సందేహాలు అందరిలో నెలకొన్నాయి. ప్రస్తుతం స్థానిక సంస్థలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉండి, నిధులు రాక అభివృద్ధి కుంటుపడింది. అయితే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చింది. అందులో భాగంగానే రిజర్వేషన్లు 50 శాతానికి లోబడి ఉండాలనే కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఆలస్యమవుతూ వచ్చింది. అయితే తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇస్తుండటం తో ఇప్పుడు అదే పద్ధతిని రాష్ట్ర ప్రభుత్వం అవలంబించాలని భావిస్తోంది. ప్రస్తుతం అందుకు సంబంధించిన విధివిధానాలు ఖరారవుతున్నట్లు తెలుస్తుండగా, రేపో.. మాపో ఆర్డినెన్స్ వచ్చే అవకాశం ఉంది. హైకోర్టు ఇప్పటికే ఎన్నికలను పూర్తి చేయడానికి మూడు నెలల గడువు ఇవ్వగా.. ఆ లోపే పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ప్రస్తుతానికి పంచాయతీలకంటే ముందు పరిషత్ ఎన్నికలే నిర్వహిస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి. మరి రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. ఇప్పటికే ఓటర్ జాబితా సిద్ధం కాగా.. కావాల్సిన బ్యాలెట్ బాక్సులు, సామగ్రి, ప్రింటింగ్ కూడా అధికారులు పూర్తిచేసి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నారు. గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండగా.. మెజారిటీ స్థానాలను ఆ పార్టీనే దక్కించుకుంది. ఇకపోతే బీసీ రిజర్వేషన్ల విషయంలో తన నిబద్ధతను ప్రశ్నించే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదని అధికార కాంగ్రెస్ ఇప్పటికే ఎదురుదాడి ప్రారంభించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసమే ఇంత కాలం స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేశామని అంటున్నారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఎవరైనా కోర్టుకు వెళ్తే.. వాదించడానికి ఢిల్లీ నుంచి ఉద్ధండులైన న్యాయవాదులను నియమిస్తామని సిఎం రేవంత్ ఇప్పటికే ప్రకటించారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కాగితం పెట్టిన వాళ్లని, పెట్టించిన వాళ్లని సామాజిక బహిష్కరణ చేస్తామని ప్రకటించాలని బీసీ నేతలకు పిలుపునిచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపైన కాంగ్రెస్ ఎంపీలతోపాటు ఇండియా కూటమి ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని, అన్ని రాష్ట్రాల్లో రిజర్వేషన్లు అమలైతేనే నిజమైన విజయమని పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లే ప్రధాన ఎజెండా కావాలని ఆకాంక్షించారు. అంటే మొత్తంగా మెజార్టీ ప్రజలను తమ బుట్టలో వేసుకోవడానికి కాంగ్రెస్ ఎత్తుగడలు వేసిందనే చెప్పాలి. ఇకపోతే బీసీ రిజర్వేషన్లపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని సీఎం రేవంత్ రెడ్డి సహా పార్టీ నేతలు విమర్శించారు. బీసీ బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించాల్సింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు లక్ష్మణ్, ఆర్. కృష్ణయ్య ఈ రిజర్వేషన్లను సాధించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ప్రధాని మోదీ స్థానంలో రాహుల్ గాంధీ ఉండి ఉంటే.. 48 గంటల్లో తాను రిజర్వేషన్లను సాధించుకువచ్చేవారమని అంటున్నారు. రిజర్వేషన్ల అంశంపై మోదీని తెలంగాణకు చెందిన బీజేపీ కేంద్ర మంత్రులు ప్రశ్నించాలని, బీజేపీ నాయకులు తమ నిబద్ధతను చాటుకోవాలని సవాళ్లు విసురు తున్నారు. ఓ రకంగా బిజెపిని ఇరుకున పెట్టాలన్న ఎత్తుగడతో ఇదంతా చేస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచొద్దని పంచాయతీరాజ్ చట్టం చేసిందని కూడా బిఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తున్నారు. కవిత ఆనాడు ఎందుకు ఉద్యమించలేదని నిలదీస్తున్నారు. ఆ చట్టంలో పేర్కొన్న 50 శాతం నిబంధనను సవరిస్తూ తాము ఇప్పుడు ఆర్డినెన్స్ తీసుకువస్తున్నామని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తాపత్రయం పడుతున్నది తామేనని అంటున్నారు. వంద ఏండ్ల బీసీల ఆకాంక్షను  కాంగ్రెస్ పార్టీ నెరవేర్చిందని, బీసీ రిజర్వేషన్లు గొప్ప కార్యక్రమమని అభివర్ణించారు. ఆనాడు దళితులు, వెనుకబడిన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు కల్పించిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను సోనియా గాంధీ నెరవేర్చారని గుర్తు చేశారు. కులగణన పైన ఎన్నో అవాంతరాలు వచ్చినా వాటిని అధిగమించామని, ఏడాది లో పూర్తి పారదర్శకంగా, పక్కాగా కులగణన పూర్తి చేశామని ప్రకటించారు. ఫిబ్రవరి 4ను సామాజిక న్యాయ దినోత్సవంగా ప్రకటించుకున్నామని, అసెంబ్లీతోపాటు అన్ని వర్గాలతో కులగణన పైన చర్చించి, అందరి అభిప్రాయాలను తీసుకున్నామని వివరించారు. దేశానికి ఆదర్శంగా తెలంగాణలో కులగణనను చాలా పకడ్బందీగా నిర్వహించామని ప్రకటిచుకున్నారు. వ్యక్తులు స్వయంగా తమ వివరాలను డిక్లేర్ చేశారని, కులగణన డేటాను 100 శాతం డిజిటలైజేషన్ చేశామని వెల్లడించారు. భవిష్యత్తులో ఎవరూ చాలెంజ్ చేయడానికి వీలు లేకుండా డేటాను భద్రపరిచామని  వెల్లడించారు. దేశంలోనే తెలంగాణ కులగణన ఒక బెస్ట్ మోడల్ అని పేర్కొంటున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా బీసీలకు రిజర్వేషన్లు కల్పించలేదని ప్రచారం చేస్తున్నారు. మొత్తానికి వివిధ పథకాలతో పాటు, బిసి రిజర్వేషన్ల అమలుపైనే కాంగ్రెస్ ఎజెండా సాగుతోంది. స్థానిక ఎన్నికల్లో క్లీన్ స్వీప్ దిశగా వ్యూహాత్మకంగా కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో బిఆర్ఎస్, బిజెపిలు దీనిని అధిగమించి ఎలా సాగుతారన్నది చూడాలి.

## పహల్గాం ఘటనకు బాధ్యులెవరు?

### -సీఎం ఒమర్ అబ్దుల్లా



న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ

ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం మారణోమానికి బాధ్యులెవరని పరోక్షంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు. ఈ పాశవికచర్యలో అమాయకమైనా 26మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయరని, మతంపేరుతో వ్యక్తులపై కాల్పులు జరపడం దారుణమైన సంఘటన అని జమ్మూలోని మీడియా సమావేశంలో పలు కీలక వ్యాఖ్యలు చేశారు. వైఫల్యానికి ఎవరు బాధ్యత వహిస్తారు? ఇది నిఘా వైఫల్యమైతే, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? 26 మంది ప్రాణాలు కోల్పోయే అవకాశం లేదు, భద్రత, నిఘాలో వైఫల్యం జరిగిందని ఇప్పుడు మనకు తెలుసు, ఎవరైనా బాధ్యత వహించాలి" అని సీఎం ఒమర్ అన్నారు. ఈ ఘోరమైన దాడికి జవాబుదారీతనం నిర్ణయించాలని పిలుపునిచ్చారు.జమ్మూ కాశ్మీర్ ఒక పరివర్తనను చూస్తోందని, "ఉగ్రవాదం ఇక్కడ నిలబడదు" అనే వాస్తవానికి ఇది ఒక ఉదాహరణ అని జూలై 10న, ఎల్జీ మనోజ్ సిన్హా అన్నారు. కానీ గత యాభై ఏళ్లలో కూడా అలాంటి మార్పు ఎప్పుడూ జరగలేదని ప్రజలు అంటున్నారని సీఎం అన్నారు.

## కుండపోత వర్షాలు..

### 12 మంది మృతి.. నిలిచిపోయిన రైళ్లు..!




న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ

ఉత్తరాది రాష్ట్రం రాజస్థాన్ ను కుండపోత వర్షాలు  ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కోటా సహా పలు జిల్లాల్లో ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. కోటా, పాలి, జాలోర్ ధోల్పూర్ జిల్లాలో ఈ వర్షాలు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలవల్ల చోటుచేసుకున్న వేర్వేరు ఘటనల్లో మొత్తం 12 మంది ప్రాణాలు కోల్పోయారు.లోతట్టు ప్రాంతాల్లో ట్రాక్‌లపై వరదనీరు నిలవడంవల్ల రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. జోధ్‌పూర్ జిల్లాలో కరెంట్ షాక్ తగిలి వేర్వేరు ఘటనల్లో ఒక రైతు, ఒక ఎలక్ట్రిసిటీ లైన్‌మాన్ ప్రాణాలు కోల్పోయారు. పాలీ జిల్లాలో భారీ వర్షాలవల్ల నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దాంతో మంగళవారం జిల్లాలోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. జాలోర్, జోధ్‌పూర్ జిల్లాల్లో ట్రాక్‌లపై వరదనీరు నిలువడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు రైళ్ల వేళల్లో మార్పులు చేశారు. కోటా జిల్లాలో చంబల్ రివర్ ఉప్పొంగి లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. చంబల్ నదిలో చేపల వేటకు వెళ్లిన ఏడుగురు జాలర్లు ప్రవాహంలో కొట్టుకుపోయారు.రాన్‌పూర్‌లో స్కూటీపై వెళ్తున్న ఓ విద్యార్థిని రోడ్డుపైకి వచ్చిన వరదలో జారిపడి కొంతదూరం కొట్టుకుపోయింది. ఎస్డీఆర్ఎఫ్ బలగాలు ఆమెను బయటికి తీసుకొచ్చినప్పటికీ ప్రాణాలు కాపాడలేకపోయారు. ధోల్‌పూర్ జిల్లాలోని నారిపుర, సంత్‌నగర్ ఏరియాల్లో వరద ప్రవాహానికి రోడ్లు తెగిపోయాయి. ఇద్దరు బైకర్‌లు ప్రవాహంలో కొట్టుకుపోయారు.

# పిల్లల ఆధార్‌ను అప్‌డేట్ చేయండి..

### తల్లిదండ్రులకు ఉడాయ్ విజ్ఞప్తి..!




న్యూఢిల్లీ–ప్రజా స్వేచ్ఛ

ఏడు సంవత్సరాలు నిండిన పిల్లల ఆధార్‌లో బయోమెట్రిక్ సమాచారాన్ని అప్‌డేట్ చేయడం కీలకమని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (UIDAI) పేర్కొంది. పిల్లల తల్లిదండ్రులు ఆధార్‌ను అప్‌డేట్ చేయాలని ఎలక్ట్రానిక్స్ అండ్ సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ మంగళవారం సూచించింది. ఈ మేరకు మంత్రిత్వశాఖ ఓ ప్రకటన జారీ చేసింది. తల్లిదండ్రులు, సంరక్షకులు ఎవరైనా ఆధార్ కేంద్రానికి వెళ్లి పిల్లల ఆధార్ వివరాలను అప్‌డేట్ చేయవచ్చని పేర్కొంది. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలు ఉంటే ఫొటో, పేరు, పుట్టిన తేదీ, జెండర్, చిరునామా వంటి వివరాలను మాత్రమే ఆధార్‌లో నమోదు చేస్తారని పేర్కొంది. పిల్లల వేలిముద్రలు, ఐరిస్ తీసుకోరని చెప్పింది.పిల్లల వయసు ఐదేళ్లు దాటిన వెంటనే వేలిముద్రలు, ఐరిస్‌తో పాటు ఫొటోను సైతం ఆధార్‌లో అప్‌డేట్ చేయించాలని చెప్పింది. ఈ అప్‌డేట్ ఐదు నుంచి ఏడేళ్ల లోపు పిల్లలకు పూర్తిగా ఉచితమని.. ఏడు సంవత్సరాల తర్వాత అప్‌డేట్ ప్రక్రియ పూర్తి చేసేందుకు రూ.100 వసూలు చేయనున్నట్లు చెప్పింది. తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ సకాలంలో చేయకపోతే పిల్లల ఆధార్ నంబర్‌ను డీయాక్టివేట్ చేసే ప్రమాదం ఉందని పేర్కొంది. క్రమం తప్పకుండా, బయోమెట్రిక్ డేటా పిల్లలకు అనేక అనేక సౌకర్యాలుంటాయని చెప్పింది. పాఠశాల అడ్మిషన్, పరీక్ష రిజిస్ట్రేషన్, స్కాలర్‌షిప్, ప్రభుత్వ ప్రత్యక్ష నగదు బదిలీ తదితర పథకాలకు ఆధార్ అవసరమవుతుందని పేర్కొంది. తల్లిదండ్రులు క్రమం తప్పకుండా తమ పిల్లల ఆధార్ వివరాలను అప్‌డేట్ చేయించాలని ఉడాయ్ కోరింది.

## బేటీ పడావో.. బేటీ జలావో..

# బీజేపీ పాలిత ఒడిశాలో దుస్థితి

-హెచ్‌వోడీ లైంగిక వేధింపులు భరించలేక నిప్పంటించుకున్న బాధితురాలు దవాఖానలో మృతి

-బీజేపీ వ్యవస్థీకృత హత్యేనని విపక్షాలు, విద్యార్థి సంఘాల ఫైర్

-రేపు రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు



హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ

'బేటీ బచావో.. బేటీ పడావో' అంటూ ఒకవైపు ప్రచారం చేసుకొంటున్న బీజేపీ అధికారంలో ఉన్న ఒడిశాలో విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయింది. తనను లైంగికంగా వేధిస్తున్నాడని, చదువు సాగాలంటే తన కోరిక తీర్చాలని ఒత్తిడి తెస్తున్నాడని ఆ విద్యార్థిని చేసిన ఆక్రందనలు అరణ్య రోదనగానే మిగిలాయి. తన ఆవేదనను పట్టించుకోవట్లేదని చివరకు ఒంటికి నిప్పంటించుకొన్న ఆ బీఈడీ విద్యార్థిని సోమవారం అర్ధరాత్రి కన్నుమూసింది. దీంతో ఒడిశా బీజేపీ ప్రభుత్వం తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసలేం జరిగిందంటే.. బాలాసోర్‌లోని ఫకీర్ మోహన్ కాలేజీలో బాధిత విద్యార్థిని సెకండియర్ ఇంటిగ్రేటెడ్ బీఈడీ చదువుతున్నది. అయితే, తన లైంగిక కోరికలు తీర్చమంటూ హెచ్‌వోడీ సమీర్ కుమార్ సాహూ గత కొన్నిరోజులుగా ఆమెను వేధిస్తున్నాడు. దీంతో ఈ నెల 1న అంతర్గత ఫిర్యాదుల కమిటీకి (ఐసీసీ) బాధితురాలు ఫిర్యాదు చేసింది.నిందితుడిపై కమిటీ సభ్యులు చర్యలు తీసుకొంటారని ఆమె భావించింది. అయితే, పది రోజులు గడిచినప్పటికీ, ఎలాంటి స్పందన రాకపోవడంతో మిగతా విద్యార్థులతో కలిసి శనివారం కాలేజీ గేటు ముందు నిరసనకు దిగింది. ఈ క్రమంలో హఠాత్తుగా ప్రిన్సిపల్ క్యాబిన్ వద్దకు వెళ్లిన బాధితురాలు ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొన్నది. మూడు రోజుల చికిత్స అనంతరం సోమవారం ఆమె మరణించింది. ఈ ఘటనకు సంబంధించి హెచ్‌వోడీ, ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేసి ఇద్దరినీ అరెస్ట్ చేశారు. తన కుమార్తె మరణానికి ఐసీసీ సభ్యులే కారణమని, వాళ్లు పక్షపాత ధోరణితో ప్రవర్తించారని బాధితురాలి తండ్రి ఆరోపించారు. మృతురాలి కుటుంబానికి రూ. 20 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించింది. బాధితురాలి స్వగ్రామంలో జరిగిన అంత్యక్రియలకు వేలాదిమంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

### బీజేపీ హత్యే

బాధితురాలిని రక్షించడంలో ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వం విఫలమయ్యిందని కాంగ్రెస్ నేత రాహుల్ మండిపడ్డారు. కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేసినప్పటికీ బాధితురాలికి న్యాయం జరుగలేదని, ఆమె మృతికి సిస్టమ్ ఫెయిల్యూరే కారణమని మాజీ సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. బీజేపీ ఇచ్చిన 'బేటీ బచావో.. బేటీ పడావో' నినాదం క్రమంగా ఒడిశాలో 'బేటా పడావో.. బేటీ జలావో(కూతురిని తగుల బెట్టండి')గా మారిందని బీజేడీ మండిపడింది.

# కుమ్మర కుల పెద్దలకు ఓ విజ్ఞప్తి



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ...

భారతదేశంలో కొన్ని కుల సముదాయాలు వారి పేర్ల చివరన ఉపసర్గలు (గౌడ్, యాదవ్, సర్దార్, శర్మ, రెడ్డి, రాజు, నాయుడు మొదలైనవి) ఉపయోగించడం ద్వారా తమ సామాజిక గుర్తింపును పెంపొందించుకుంటున్నారు. ఇది వారికి సమాజంలో ప్రత్యేక గౌరవాన్ని, ఐక్యతను కలిగిస్తుందని మనం గమనించవచ్చు. అయితే, కొన్ని కుల సమూహాలు ఈ విధానాన్ని అనుసరించకపోవడం వల్ల, వారి ప్రాముఖ్యత క్రమంగా తగ్గిపోతుందని మనం గుర్తించాలి.

**సామాజిక గుర్తింపు అవసరం**

ఇతర కుల సమాజాల మాదిరిగా మన కుమ్మర కులస్థులు కూడా మన పేరు చివరన మన కులాన్ని సూచించే గుర్తింపును (కుమ్మరి / శాలివాహన / ప్రజాపతి) వినియోగించకపోతే, మన సమాజ అభివృద్ధి నెమ్మదించవచ్చని నా అభిప్రాయం. సామాజిక గుర్తింపును ప్రోత్సహించడం వల్ల కులంలోని వ్యక్తులకు సమాన అవకాశాలు, పరస్పర సహాయ సహకారాలు లభించే అవకాశం ఉంటుంది.

**గౌరవంతో మన వారసత్వాన్ని కొనసాగించాలి**

కులం పేరును ఒక నిందగా కాకుండా, గౌరవంగా స్వీకరించాలి (కుమ్మరి / శాలివాహన / ప్రజాపతి). దానిని ఉపయోగించడం ద్వారా మన కుమ్మర కుల సమాజాన్ని అభివృద్ధి చేయగలమని నా అభిప్రాయం. ఇది మనకు గౌరవాన్ని మాత్రమే కాదు, భవిష్యత్ తరాలకు మన వారసత్వాన్ని అందించే మార్గాన్ని సృష్టిస్తుంది.


**ఐక్యత కోసం ఒక చిన్న మార్పు**

మన కులస్థులంతా ఐక్యంగా, పరస్పర సహాయ సహకారాలతో ఉండాలని, మన పేరు చివరలో మన కులాన్ని గుర్తించేలా ఉపసర్గను ఉపయోగించగలరని నా మనవి. ఇది మనకోసం మాత్రమే కాదు, మన తరువాతి తరాల భవిష్యత్ కోసం కూడా. మన ఆత్మగౌరవాన్ని పెంచే ఈ చిన్న మార్పును అందరూ ఆచరిస్తారని ఆశిస్తున్నాను.

జై కుమ్మర! జై జై కుమ్మర! ?

## సీఎం రిలీఫ్ చెక్కులు ఫండ్ నిరు పేదలకు వరం.

నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి.



మహేశ్వరం, ,ప్రజా స్వేచ్ఛ...

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు నిరుపేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేశ్వరానికి చెందిన మునావత్ చందర్ నాయక్ కు 60 వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణ నాయక్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షుడు బంగారు గల్ల లాజర్ తో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఆయన అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే నిధులను విడుదల చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు ఏనుగు జంగారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవుల యాదయ్య, అమనగంటి ప్రశాంత్ రెడ్డి, స్వర్ణ గంటి సుభాష్, గదగూటి జంగయ్య, ప్రవీణ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

## పొన్నారంలో డ్రైడే



మందమర్రి ,ప్రజా స్వేచ్ఛ...

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున వ్యాధుల బారి నుండి ప్రజలను కాపాడేందుకే డ్రైడే కార్యక్రమం చేపడుతున్నట్లు గ్రామ కార్యదర్శి ఎస్ హరీష్ తెలిపారు. మండలంలోని పొన్నారం గ్రామపంచాయతీలో డ్రైడే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించి ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండటం మూలంగా కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండడం మూలంగా దోమలు వ్యాప్తి చెంది విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రామస్తులు తమ ఇంటి పరిసరాలలో, మురుగు కాలువలలో నీరు నిలువ లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఈద లింగయ్య,
వేల్పుల శ్రీనివాస్, ఆశా వర్కర్ మాసు సుజాత లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వాల్యా మృతుదేహం

కాడ్లూర్ వద్ద రోడ్డు ప్రమాదం ఒకరు మృతి..

పోలీసుల తనిఖీ పట్టుబడ్డ బులేరా వాహనం



టేక్మాల్,,ప్రజా స్వేచ్ఛ...

మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని కాడ్లూర్ గ్రామ శివారు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. అల్లాదుర్గం మండలం ముప్పారం తండాకు చెందిన వాల్యా (48) అనే వ్యక్తి టేక్మాల్ వైపు నుండి ఎక్సెల్ వాహనంపై బొడ్మట్పల్లి మీదుగా ముప్పారం వెళ్తుండగా బులేర వాహనం అతివేగంగా వస్తు ఢీ కొట్టి తప్పించుకునేందుకు గాను అక్సిడెంట్ చేసి డ్రైవర్ ప్రయత్నించాడు. టేక్మాల్ పోలీసులు ఏఎస్ఐ క్రిష్ణ తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. అతివేగంగా వస్తు ఢీ కొట్టిన వాహనం దాటికి ఎక్సెల్ పై ఉన్న వాల్య మృతదేహం పది మీటర్ల దూరంలో నెత్తి పగిలి, కాళ్లు చేతులు విరిగి మాంసం ముద్ద రూపంలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో పుట్టినరోజు జరుపుకున్న చల్లపల్లి శ్రీకాంత్





టేక్మాల్ ,ప్రజా స్వేచ్ఛ...

మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని చల్లపల్లి గ్రామానికి చెందిన యువ కాంగ్రెస్ నాయకుడు శ్రీకాంత్, త్రిష దామోదర్ ఆధ్వర్యంలో పుట్టినరోజు ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో మండల యువజన అధ్యక్షుడు సంగమేశ్వర గౌడ్, మహేష్ రెడ్డి, టేక్మాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్, రాజా గౌడ్, శ్రీకాంత్ బోడగట్టు, ఎల్లంపల్లి సంగమేష్, సిద్దు, వెంకట్ గౌడ్, హరి ప్రసాద్, మల్లేశం, రమేష్, శ్రీనివాస్, పెద్ద గొల్ల శ్రీను, మరియు తదితరులు పాల్గొన్నారు

## ప్రజల త్రాగునీటి కొర్త తీర్చిన మంత్రి



మక్తల్ ,ప్రజా స్వేచ్ఛ...

మక్తల్ నియోజకవర్గం లోని నర్వ మండల పరిధిలోని ఉందే కోడ్ గ్రామంలో మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్ మండల ఎంపిడివో శ్రీనివాస్ తో కలసి మోటార్ ఆన్ చేసి ప్రారంభించారు.గ్రామంలో ప్రజలకు త్రాగునీరు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి మండల నాయకులు తీసికెళ్లడంతో వెంటనే మంత్రి గారు స్పందించి అధికారులకు ఆదేశించి బోరు మోటర్ వేయించారు.ప్రజలత్రాగునీరు ఇబ్బందులు తెలుసుకొని త్రాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించినందుకు గ్రామ ప్రజలు రాష్ట్రమంత్రి వాకిటి శ్రీహరిని మరియు మండల నాయకులు.గ్రామ కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ.మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శరణప్ప.జిల్లా జనరల్ సెక్రెటరీ శ్రీనివాసరెడ్డి.నాయకులు వివేక వర్ధన్ రెడ్డి. కృష్ణారెడ్డి. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ గౌడ్. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కొండప్ప. నాగప్ప. ఉమాపతి.b నరసింహ జంగంరెడ్డిపల్లి రాజారెడ్డి. రవీందర్ రెడ్డి. వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు. గ్రామ పెద్దలు. ప్రజలు పాల్గొన్నారు.

## నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించిన వినయ్ రెడ్డి..




ఆర్మూర్,,ప్రజా స్వేచ్ఛ...

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి ఆలయ అభివృద్ధికి పది లక్షల ఐదువేల రూపాయలను చందా రూపంలో ఇస్తానని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ రెడ్డి ముదిరాజ్ సంఘ సభ్యులకు చెప్పడం జరిగింది.మంగళవారం ఆర్మూర్ పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీస్సులను తీసుకున్న వినయ్ రెడ్డి.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్,ఆర్మూర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు డార్లింగ్ రమేష్,బోండ్ల సంతోష్,రాము,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఖాందేశ్ శ్రీనివాస్,శ్యామ్ గౌడ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బోండ్ల సంతోష్,మందుల గంగాధర్,జక్కమ్ శేఖర్, సాంబడి కుమార్,సుంకరి మోహన్, మందుల రమేష్, బొంబాయి భోజన్న,జక్కం పోశెట్టి,విటల్,బోండ్ల ఆనంద్ సుమన్,గోపి,పెద్దమ్మ తల్లి ఆలయ అధ్యక్షుడు గాజం మచ్చేందర్, తదితరులు పాల్గొన్నారు.

## సీడ్ విత్తనోత్పత్తి మేనేజర్ మధుసూదన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన

బిజ్వారం ఎస్.తిరుమలేష్, సబ్ ఆర్గనైజర్ గోకరన్న



జోగులాంబ గద్వాల జిల్లా ,ప్రజా స్వేచ్ఛ...

అనునిత్యం రైతుల అభివృద్ధికై నిత్యం పరితపిస్తూ, ఎదిగే కొద్ది ఒదిగి ఉంటూ రైతుల సంక్షేమాన్ని కోరుకునే నిత్య శ్రేయోభిలాషి సీడ్ విత్తనోత్పత్తి కంపెనీ మేనేజర్ మధుసూదన్ రెడ్డి గారు మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లాలోని ఆయా రైతులు పండిస్తున్న పత్తి పంటల పరిశీలనకై విచ్చేసిన శుభ సందర్భంగా బిజ్వారం తిరుమలేష్ సబ్ ఆర్గనైజర్ అమరవాయి గోకరన్న మర్యాదపూర్వకంగా కలిసి ఒకరినొకరి యోగక్షేమాలు తెలుసుకొని ఆనందం పంచుకున్నారు.

## కాంగ్రెస్ యువ నాయకుడు చల్లపల్లి శ్రీకాంత్ పుట్టినరోజు ఘనంగా నిర్వహించారు





**టేక్మాల్ ,ప్రజా స్వేచ్ఛ...**
టేక్మాల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగమేశ్వర గౌడ్ ఆధ్వర్యంలో చల్లపల్లి కాంగ్రెస్ యువ నాయకుడు శ్రీకాంత్ పుట్టినరోజు కేక్ కట్ చేసి శాలువాతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో, మహేష్ రెడ్డి, రాజా గౌడ్, సిద్దు, శ్రీకాంత్ బోడగట్టు, కాజులూరు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు హరి ప్రసాద్, ఎల్లంపల్లి సంగమేష్, వెంకట్ గౌడ్, అంజయ్య, ఓబలి మల్లేశం, ఎరుకల శ్రీను, నది రమేష్, పెద్ద గొల్ల శీను, కృష్ణ, అశోక్, మరియు తదితరులు పాల్గొన్నారు


## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు టియుడబ్ల్యూజే ఎల్లప్పుడూ ముందుంటుంది.

**రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రకాష్ రెడ్డి,మంచిర్యాల, జిల్లా అధ్యక్షులు దేగ సత్యం.**



**మంచిర్యాల జిల్లా ,ప్రజా స్వేచ్ఛ...**
రాష్ట్రంలో,జిల్లాలోనూ, జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు, టీయూడబ్ల్యూజే యూనియన్ ఎప్పుడూ ముందుంటుందని, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు రూపురెడ్డి ప్రకాశ్ రెడ్డి, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు దేగ సత్యం లు అన్నారు.యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లికి వచ్చిన వారు, బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ (టేకులబస్తీ)లో సభ్యులకు సభ్యత్వ రసీదులను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు టీయు డబ్ల్యూజే ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందని, రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లాలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి సభ్యుడు యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. జర్నలిస్టుల ఏ సమస్య అయినా జిల్లా బాధ్యులకు తెలియజేస్తే సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో, ప్రజా ప్రతినిధులతో, నాయకులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం క్లబ్ సభ్యులు అతిథులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మద్దెల సంజీవ్, క్లబ్ అధ్యక్షులు కారుకూరి సదానందం, ఉపాధ్యక్షులు దండే బోయిన భాస్కర్, ఇరుకుల రమేష్, కార్యదర్శి మనోజ్ కుమార్ పాండే, సభ్యుడు రాకేష్ పాండే, తదితరులు పాల్గొన్నారు.

## నిండుకుండలా సాగర్ జలాశయం



**నాగార్జునసాగర్ ,ప్రజా స్వేచ్ఛ...**
నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువ నుండి భారీ వరద రావడంతో నాగార్జునసాగర్ జలాశయం కళకళలాడుతుంది. నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం 590 అడుగులకు గాను 556.30 అడుగులుగా ఉన్నది. టీఎంసీలలో 312.0450 టీఎంసీలగాను 223.8729 టీఎంసీలుగా ఉన్నది.
ఎస్.ఎల్.బి. సి కి1650 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. నీటి రాక కొనసాగితే త్వరలోనే సాగర్ జలాశయం పూర్తి స్థాయిలో నిండే అవకాశం ఉన్నదని ఇంజనీరింగ్ అధికారులు తెలుపుతున్నారు.

# భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

## -చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**ప్రజా స్వేచ్ఛ...రాజన్న సిరిసిల్ల జిల్లా**
రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం పై అదనపు కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సిసిఎల్ఏ భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్ తెలిపారు. మంగళవారం సిసిఎల్ఏ లోకేష్ కుమార్ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం పై అదనపు కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు . ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు ఈ సందర్భంగా చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారానికి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఫైల్ ప్రాసెస్ మొత్తం ఆన్లైన్ పద్ధతి లో ప్రొసీజర్ ప్రకారం మాత్రమే నిర్వహించలన్నారు.

# రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలి

**-కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి**




**మిర్యాలగూడ ,ప్రజా స్వేచ్ఛ...**
మిర్యాలగూడ రజక సంఘం ఆధ్వర్యంలో బీసీ భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో రజక సంఘం పెద్దలు బాసాని గిరి , నల్లగంతుల నాగభూషణం మాట్లాడుతూ భారతదేశం అన్ని రంగాలలో సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగుతున్నప్పటికీ నేటికీ అనేక గ్రామాల్లో పట్టణాలలో రజకులపై దాడులు, గ్రామబహిష్కరణలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశంలోని 17 రాష్ట్రాల్లో కేంద్రపాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రజకులపై దాడుల పరంపర కొనసాగిందని అన్నారు. వెనుకబడిన మా మా రజక వృత్తి చేసుకుంటూ హాస్పటల్, ప్రైవేటు స్కూల్స్ , లాడ్జిలలో తమ యొక్క వృత్తి చేసుకుంటున్న తరుణంలో కార్పొరేట్ వ్యవస్థ ద్వారా మిషన్లో ద్వారా వృత్తి పోయే పరిస్థితి ఏర్పడింది. అందుకు మిర్యాలగూడలో రజకులను ఆదుకోవాల్సిన బాధ్యత రజక పెద్దలపై ఉంది ఎక్కడ రజకులకు అన్యాయం జరిగిన వారికి న్యాయం చేసేందుకు పోరాటం చేసేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. రజకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పార్టీలకు, గ్రూపులకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పోరాటాలు చేసి విజయం సాధించాలని కోరారు. రజక మహిళలు తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ ను ఆదర్శంగా తీసుకొని రాజకీయంగా, రజకుల సమస్యల పరిష్కారానికి ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అతి త్వరలోనే జిల్లాల్లోపర్యటించి రజకులు ఎదుర్కొన్న సమస్యలు తెలుసుకొని రజక సంఘం బలోపేతానికి కృషి చేయటం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా మిర్యాలగూడ పట్టణ కమిటీ రద్దు కావడంతో కొత్త కమిటీని ఎన్నుకోవటానికి అందరూ సహకరించి 5.8. 2025 తారీకున సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుంది. కావున మన రజకులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి దుర్గయ్య, జంజరాల నాగరాజు, ఖమ్మంపాటీ సైదులు, యాదగిరి, భీమరాజు, నారాయణ తుకారం, నేరెళ్ల శేఖర్, నగేష్ , నేరెళ్ల రవి, రాములు, బిక్షం ,
రజక సోదరులు పెద్దలు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అధికారులు మాకు న్యాయం చేయాలని వినతి..

**ఆర్మూర్,ప్రజా స్వేచ్ఛ...**
ఆర్మూర్ నియోజకవర్గంలోని డోంకేశ్వర్ మండలం జీజీనడ్కుడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తమ భూమిని పట్టా చేసుకొని కబ్జా చేశాడని గంపల కళ్యాణ్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ భవనంలో మంగళవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ.. గత 60 సంవత్సరాలు తాము వ్యయసాయ భూమి కబ్జాలో ఉన్నామన్నారు. సర్వేనెంబర్ 1129లో 30 గుంటల భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నాడని అలాగే 1131 సర్వేనెంబర్‌లో అసైన్‌మెంట్ భూమి 28గుంటలు తన పేరుమీదు చేసుకున్నాడని దీంతో పాటు తమకు 1ఎకరం 10గుంటల భూమి కబ్జా చేసి భయందోళనకు గురిచేస్తున్నాడని అన్నారు. తమ వద్ద అన్ని రకాల భూమికి సంబంధించిన పత్రాలు ఉన్నాయన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోయారు.ఇప్పటికైన ఉన్నత అధికారులు స్పందించి తమ భూమి తమకు




వచ్చేవిధంగా చూడాలని కోరారు.ఈ సమావేశంలో దళిత సంఘాల నాయకులు అర్గుల్ సురేష్,మూగ ప్రభాకర్,తదితరులు పాల్గొన్నారు.ఇటీవల ఎస్సీ, ఎస్టి కమిషనర్ నిజామాబాద్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు కలెక్టర్ కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు.దీనిపై కమిషనర్ కలెక్టర్ కు ఈ భూమి సమస్యను పరిష్కరించాలని సూచించారని తెలిపారు.
దళితుల భూములను కబ్జా చేస్తే ఎస్సీ,ఎస్టీ కమిషన్ ద్వారా చర్యలు తీసుకుంటామని హెచ్చరించాలని తెలిపారు. అధికారులు దయచేసి మా భూమిని మాకు అప్పగించే విధంగా చూడాలని వాపోయారు. బాల్కొండ సిఐ ఆ భూస్వామికి వంత పాడుతున్నట్లు ఆయన ఆరోపించారు.

## బిజినెస్

# నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్..

### 317 పాయింట్లు సెన్సెక్స్ జంప్..!



దేశీయ స్టాక్ మార్కెట్‌లో నాలుగు రోజుల తర్వాత మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. జూన్ నెలలో భారత దేశ ద్రవ్యోల్బణం 77 నెలల కనిష్ట స్థాయి 2.1శాతానికి తగ్గింది. ఈ క్రమంలో మార్కెట్‌లో అన్నిరంగాల్లో కొనుగోళ్లు కనిపించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,233.16 ఫ్లాట్‌గా మొదలైంది. ఈ తర్వాత కోలుకొని లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఇంట్రాడేలో 82,221.74 పాయింట్ల కనిష్టానికి పెరిగిన సెన్సెక్స్.. గరిష్టంగా 82,743.62 పాయింట్లకు చేరింది. చివరకు సెన్సెక్స్ 317.45 పాయింట్లు పెరిగి 82,570.91 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 113.50 పాయింట్లు పెరిగి 25,195.80 వద్ద ముగిసింది. అన్ని రంగాల సూచీలు ఫార్మా, ఆటో, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ 0.5-1 శాతం పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు దాదాపు ఒకశాతం పెరిగాయి. హీరో మోటోకార్ప్, సన్ ఫార్మా, బజాజ్ ఆటో, అపోలో హాస్పిటల్స్, శ్రీరామ్ ఫైనాన్స్ నిఫ్టీలో ప్రధానంగా లాభాలను నమోదు చేశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఎటర్నల్, టాటా స్టీల్ నష్టపోయాయి. విస్తరణ ప్రణాళిక నేపథ్యంలో హీరో మోటోకార్ప్ షేర్లు 5 శాతం పెరిగాయి. ర్యాలీస్ ఇండియా షేర్లు 52 వారాల గరిష్టాన్ని తాకాయి. క్యూ 1లో లాభం దాదాపు రెట్టింపు అయిన విషయం తెలిసిందే. తేజస్ నెట్‌వర్క్స్ షేర్లు క్యూ 1లో నష్టాల నేపథ్యంలో షేర్లు 6 శాతం పడిపోయాయి. యూఎస్ పేటెంట్ సెటిల్‌మెంట్ లెక్సెల్వి ప్రారంభానికి మార్గం సుగమం కావడంతో సన్ ఫార్మా షేర్లు దాదాపు 3శాతం పెరిగాయి. ఈస్ట్ సెంట్రల్ రైల్వే నుంచి ఆర్డర్లతో రైల్‌టెల్ కార్పొరేషన్ షేర్లు 2 శాతం పెరిగాయి. టాటా టెక్నాలజీస్ షేర్లు జూన్ త్రైమాసికంలో నికర లాభం 5శాతం పెరగడంతో షేర్లు 2 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 140 స్టాక్‌లు 52 వారాల గరిష్ట స్థాయికి చేరాయి.

# భారత్‌లో టెస్లా ‘ Y’ మోడల్ కార్ల అమ్మకాలు..


### -రూ.59.89 లక్షల నుంచి ప్రారంభం



ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత్‌లో తొలి షోరూంను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇవాళ ఉదయం ముంబై నడిబొడ్డున ఉన్న బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (BKC) లోని మేకర్ మ్యాక్సిటీ మాల్‌లో టెస్లా తన తొలి షోరూంను గ్రాండ్‌గా లాంఛ్ చేసింది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన ‘వై’ మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది. భారత్‌లో (రియర్-వీల్ డ్రైవ్), లాంగ్-రేంజ్ RWD వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్-వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్-రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి ‘ఆన్ రోడ్’ ధరల్ని పరిశీలిస్తే వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్-రేంజ్ వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జీఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది. ఈ వాహనాలు చైనాలోని టెస్లా షాంఘై గిగాఫ్యాక్టరీ నుంచి దిగుమతయ్యాయి. ఈ వై మోడల్ వేరియంట్ ధరలు అమెరికాలో 44,990 డాలర్లు (భారత కరెన్సీలో రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్ (రూ.31.57 లక్షలు), జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09 లక్షలు)గా ఉన్నాయి. వీటితో పోలిస్తే భారత్‌లోనే ఈ వై మోడల్ ధరలు అధికం కావడం గమనార్హం. దిగుమతి సుంకం, లాజిస్టిక్స్ ఖర్చులే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది.

# త్వరలో కొత్త సపోర్ట్ చాట్ ఫీచర్‌ను తీసుకురానున్న వాట్సాప్..!

ఐఓఎస్ యూజర్లకు వాట్సాప్ మరో కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. స్పెషల్ సపోర్ట్ చాట్ ద్వారా ఏఐ యూజర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వనున్నది. ఈ కొత్త ఫీచర్ వాట్సాప్ యాప్ తాజా వెర్షన్‌లోకి రాగా.. రాబోయే వారాల్లో మిగతా యూజర్లందరికీ అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఈ సపోర్ట్ చాట్ కోసం మొదట వాట్సాప్ సెట్టింగ్‌లోకి వెళ్లాలి. అందులో హెల్ప్ బటన్‌పై క్లిక్ చేయాలి. అందులో హెల్ప్‌సెంటర్ బటన్‌పై క్లిక్ చేస్తే కాంటాక్ట్ అస్ పై క్లిక్ చేసి యాక్సెస్ చేయొచ్చు. దాంతో యూజర్లు అధికారిక వాట్సాప్ సపోర్ట్ ఖాతా అని సూచించే మెటా వెరిఫైడ్ బ్లూ టిక్‌తో కొత్త చాట్ విండో ఓపెన్ అవుతుంది. ఈ చాట్‌లో యూజర్లు అడిగే




ప్రశ్నలన్నింటికీ సమాధానాలు ఇస్తుంది. ఈ సమాధానాలన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) మాత్రమే జనరేట్ చేస్తుంది. అయితే, ఈ సమాధానాల్లో కొన్ని తప్పు, లేదా అనుచిత సమాచారం ఉండవచ్చని నోటిఫికేషన్ వస్తుంది. ప్రతి సమాధానం కిందట Meta AI ఇండికేటర్, టైమ్‌స్టాంప్ సైతం ఉంటుంది. వినియోగదారులు తమ సమస్యలను నేరుగా టెక్స్ట్ ద్వారా, స్క్రీన్‌షాట్స్‌ల ద్వారా పంచుకోవచ్చు. రెస్పాన్స్ సైతం వేగంగా ఉంటుంది. ప్రతి చాట్‌కు ఒక సపోర్ట్ టికెట్ నెంబరు కూడా ఇస్తారు. ఈ ఫీచర్ తరచుగా అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ప్రత్యేకంగా ఉపయోగపడుతుంది. వినియోగదారుడు మానవ సహాయం కోరితే.. సహాయక సిబ్బంది జోక్యం చేసుకుంటారని పేర్కొంటూ యూజర్లకు ఓ ఆటోమేటెడ్ సందేశం కనిపిస్తుంది.

# మళ్లీ టాప్-10లో లేడీ సెహ్వాగ్..

## తెలుగమ్మాయికి కెరీర్ బెస్ట్ ర్యాంక్..!

పునరామనంలో ఒత్తిడి అనేదే లేకుండా చెలరేగి ఆడుతున్న భారత ఓపెనర్ షఫాలీ వర్మ ర్యాంకింగ్స్‌లో దూసుకొచ్చింది. మునపటి ఫామ్‌తో బౌలర్లను వణికించిన ఈ లేడీ సెహ్వాగ్ ఐసీసీ మహిళల ర్యాంకింగ్స్ లో మళ్లీ టాప్-10లో నిలిచింది. ఇంగ్లండ్‌తో జరిగిన పొట్టి సిరీస్‌లో పరుగుల వరద పారించిన షఫాలీ టీ20 బ్యాటర్లలో తొమ్మిదో స్థానం దక్కించుకుంది. తొలి సిరీస్‌లోనే అద్భుతంగా రాణించిన తెలుగమ్మాయి శ్రీ చరణి ఏకంగా టాప్ టెన్‌లో నిలవడం విశేషం. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్న ఈ స్పిన్ కెరటం ఆరో ర్యాంక్ కైవసం చేసుకుంది. భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన మూడో ప్లేస్‌లో కొనసాగుతుండగా.. రెండు స్థానాల్ని కోల్పోయిన మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ 14వ ర్యాంక్ సాధించింది. ఇంగ్లండ్ చరిత్రాత్మక పొట్టి సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన రాధా



యాదవ్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో 5 వ స్థానంలో నిలిచింది. పేసర్ అరుంధతీ రెడ్డి నాలుగు స్థానాలు మెరుగుపరచుకొని 36వ ర్యాంక్ సొంతం చేసుకుంది. ఆల్‌రౌండర్ దీప్తి శర్మకు మాత్రం షాక్ తగిలింది. టాప్ 2లో ఉన్న ఆమె మూడో స్థానానికి పడిపోయింది.

**మహిళా బ్యాటర్ల టాప్ -5 ర్యాంకింగ్స్ :** బేత్ మూనీ (ఆస్ట్రేలియా), హేలీ మాథ్యూస్(వెస్టిండీస్), స్మృతి మంధానా(భారత్), తహ్లియా మెక్‌గ్రాత్(ఆస్ట్రేలియా), లారా వొల్వార్డ్(దక్షిణాఫ్రికా).

**మహిళా బౌలర్ల టాప్ -5 ర్యాంకింగ్స్ :** సదియా ఇక్బాల్(పాకిస్థాన్), అనబెల్ సథర్‌లాండ్(ఆస్ట్రేలియా), దీప్తి శర్మ(భారత్), సోఫీ ఎకిల్‌స్టోన్(ఇంగ్లండ్), లారెన్ బెల్(ఇంగ్లండ్).

**మహిళా ఆల్‌రౌండర్ల టాప్ -5 ర్యాంకింగ్స్ :** హేలీ మాథ్యూస్(వెస్టిండీస్), అమేలి కేర్(న్యూజిలాండ్), దీప్తి శర్మ(భారత్), అష్ గార్డ్‌నర్(ఆస్ట్రేలియా), చమరి ఆటపట్టు (శ్రీలంక).

పొట్టి క్రికెట్ సంచలనం షఫాలీ మరోసారి తన మెరుపులతో ఫ్యాన్స్‌ను అలరిస్తోంది. ఫామ్‌లేమితో ఏడాది పాటు జట్టుకు దూరమైన ఈ డాషింగ్ ఓపెనర్ ఇంగ్లండ్ పర్యటనలో మెరుపు బ్యాటింగ్‌తో బెంబేలెత్తిస్తోంది. ఈమధ్యే ముగిసిన ఐదు మ్యాచ్‌ల పొట్టి సిరీస్‌లో 158.56 స్ట్రయిక్ రేటుతో 176 రన్స్ కొట్టింది.

# టీమిండియాకు కింగ్ చార్లెస్-3 ఆతిథ్యం..

## లార్డ్స్ టెస్ట్‌లో సిరాజ్ ఓటమిపై ఏమన్నాడంటే..?

టీమిండియా మెన్స్, వుమెన్స్ జట్లు ఇంగ్లండ్‌లో పర్యటిస్తున్నాయి. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని మెన్స్ టీమ్ ఐదు టెస్టుల సిరీస్‌ను ఆడుతున్నది. హర్మన్ ప్రీత్ కౌర్ నేతృత్వంలోని వుమెన్స్ టీమ్ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడుతున్నది. ఇంతకుముందు ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇంగ్లాండ్‌ను 3-2 తేడాతో ఓడించింది. రెండుజట్లకు కింగ్ చార్లెస్ ఆతిథ్యం ఇచ్చారు. లండన్‌లోని సెయింట్ జేమ్స్ ప్యాలెస్‌లో మంగళవారం రెండుజట్లు కింగ్ చార్లెస్-3ని కలిశాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ కింగ్ చార్లెస్‌ను కలిసి మాట్లాడడం బాగుందన్నారు. మహ్మద్ సిరాజ్ అవుట్ అయిన విధానంపై కింగ్ ఛార్లెస్ స్పందించారని చెప్పాడు. లార్డ్స్ టెస్టులో చివరి బ్యాట్స్‌మెన్ అవుట్ అయిన తీరు దురదృష్టకరమని అన్నారని కెప్టెన్ పేర్కొన్నాడు. మ్యాచ్‌లో ఫలితం ఎలాగైనా ఉండవచ్చని ఆయనతో అన్నామని.. రాబోయే రెండు మ్యాచుల్లో




మాకు అదృష్టం కలిసివస్తుందని ఆశిస్తున్నాం' అని అన్నట్లుగా గిల్ పేర్కొన్నాడు. లార్డ్స్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్ గురించి గిల్ మాట్లాడుతూ రెండు జట్లు ఆడిన విధానం బాగుందని.. చాలా ఉత్సాహాన్ని చూపించారని తెలిపాడు. తాము అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చామని చెప్పాడు. తాము అదృష్టవంతులమని.. ఎక్కడికి వెళ్లినా అభిమానుల నుంచి మంచి మద్దతు లభిస్తుందని చెప్పుకొచ్చాడు. లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టు చివరి రోజు సోమవారం జోఫ్రా ఆర్చర్, బెన్ స్టోక్స్ అద్భుత బౌలింగ్‌తో టీమిండియా టాప్, మిడిలార్డర్‌ను కుప్పకూల్చారు. 193 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా ఒక దశలో ఏడు వికెట్ల నష్టానికి 82 పరుగులు చేసి దాదాపు ఓటమి అంచుకు చేరుకుంది. అయినా, భారత జట్టు చివరి వరకు పోరాడింది. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 181 బంతుల్లో 61 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ ఇద్దరూ అండగా నిలిచారు. కేవలం విజయానికి 22 పరుగుల దూరంలో ఉండగా భారత జట్టు చివరి వికెట్ రూపంలో సిరాజ్ అవుట్ అవడంతో టీమిండియా పోరాటం ముగిసింది.

## స్పోర్ట్స్

# 9 పరుగులిచ్చి 6 వికెట్లు తీసిన మిచెల్ స్టార్క్..

### 27 పరుగులకే వెస్టిండీస్ ఆలౌట్



**కింగ్‌స్టన్**

వెస్టిండీస్‌తో జరిగిన మూడవ టెస్టులో ఆస్ట్రేలియా 176 రన్స్ తేడాతో గెలిచి సిరీస్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకున్నది. రెండో ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ అత్యంత దారుణంగా విఫలమైంది. కేవలం 27 పరుగులకే ఆ జట్టు కుప్పకూలింది. ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ చెలరేగిపోయాడు. జమైకా పిచ్‌పై నిప్పులు చెరిగాడు. 9 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లను తీసుకున్నాడు. మరో ఆసీస్ పేసర్ బోలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో హ్యాట్రిక్ తీసుకున్నాడు. దీంతో టెస్టు క్రికెట్ చరిత్రలోనే వెస్టిండీస్ అత్యల్ప స్కోరుకు ఆలౌటైంది. టెస్టు క్రికెట్‌లో 1955 తర్వాత ఓ జట్టు అత్యల్ప స్కోరుకు నిష్క్రమించింది. గతంలో ఇంగ్లండ్ చేతిలో న్యూజిలాండ్ 26 పరుగులకే ఆలౌటైంది. 2004లో ఇంగ్లండ్ చేతిలో వెస్టిండీస్ 47 రన్స్‌కు ఆలౌటైంది. ఆ తర్వాత మళ్లీ సోమవారం జమైకాలో తక్కువ స్కోరుకు నిష్క్రమించింది. వందో టెస్టు ఆడుతున్న మిచెల్ స్టార్క్ తన స్పీడ్‌తో దుమ్మురేపాడు. 9 రన్స్ ఇచ్చి ఆరు వికెట్లు తీసుకున్నాడు. 15 బంతుల్లోనే అతను అయిదు వికెట్లు తీసుకున్నాడు. చాలా వేగంగా అయిదు వికెట్లను తీసేశాడు. టెస్టు క్రికెట్‌లో 400 వికెట్ల మార్క్‌ను కూడా అతను దాటేశాడు. సబినా పార్క్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా కేవలం 14.3 ఓవర్లలోనే వెస్టిండీస్‌ను ఆలౌట్ చేసింది. ఈ సిరీస్‌లో ఆస్ట్రేలియా పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. బార్బడోస్‌లో జరిగిన మ్యాచ్‌లో 159 రన్స్ తేడాతో, గ్రెనిడాలో జరిగిన మ్యాచ్‌లో 133 రన్స్ తేడాతో నెగ్గింది. దీంతో ఫ్రాంక్ వొరెల్ ట్రోఫీని స్వీప్ చేసింది. ఈ మ్యాచ్‌లో స్టార్క్ హ్యాట్రిక్ మిస్సైనా.. అతని స్థానంలో బోలాండ్ ఆ ఫీట్ అందుకున్నాడు. టెస్టుల్లో హ్యాట్రిక్ తీసిన పదో ఆస్ట్రేలియా బౌలర్‌గా నిలిచాడతను. జూలై 21వ తేదీ నుంచి జరిగే అయిదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో రెండు జట్లు మళ్లీ తలపడనున్నాయి.

# నాని మూవీ కోసం అంత పెద్ద రిస్కా..

## అడ్డంకులు ఉన్నా ఈ హీరోయిన్ ఇష్టపడి చేస్తుందట..!



నేచురల్ స్టార్ నాని ఒకవైపు హీరోగా, మరోవైపు నిర్మాతగా వైవిధ్యమైన చిత్రాలు చేస్తూ ప్రేక్షకులని అలరిస్తున్న విషయం తెలిసిందే. ఆయన తాజాగా దసరా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ప్యారడైజ్ అనే సినిమా చేస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ చూసి ఫ్యాన్స్ భారీ అంచనాలు పెంచుకున్నారు. ఇటీవలే 'హిట్ 3'తో మంచి విజయాన్ని అందుకున్న నాని ప్యారడైజ్ చిత్రాన్ని శరవేగంగా పూర్తి చేసే పనిలో ఉన్నాడు. తాజాగా ఈ సినిమాకి సంబంధించిన ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. ఇది విన్న నెటిజన్స్ కొందరు ఆమె తీసుకున్న నిర్ణయాన్ని ప్రశంసిస్తుంటే , మరి కొందరు మాత్రం విమర్శలు గుప్పిస్తున్నారు.రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' సినిమాతో యువతరాన్ని ఆకట్టుకున్న అందాల నటి కయాదు లోహర్ ఇప్పుడు నాని చిత్రంలో ఛాన్స్ దక్కించుకుందని అంటున్నారు. ఈ అస్సాం బ్యూటీ ఇప్పటికే కన్నడ, మలయాళ, మరాఠీ చిత్రాల్లో తన టాలెంట్‌ను నిరూపించుకున్నారు. తెలుగులో ఆమె నటించిన తొలి చిత్రం 'అల్లూరి' (శ్రీవిష్ణుతో కలిసి నటించిన చిత్రం) ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా, టాలీవుడ్ మాత్రం ఆమెకు అడపాదడపా అవకాశాలు వస్తూనే ఉన్నాయి.. తెలుగులో విశ్వక్ సేన్ హీరోగా రూపొందుతున్న ఫంకీలో కూడా ఛాన్స్ దక్కించుకుంది. ఇక నాని %-% శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ప్యారడైజ్' చిత్రంలో వేశ్య పాత్ర పోషిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. చిత్రంలో ఈ భామ సెక్స్ వర్కర్ పాత్ర పోషిస్తుందని, ఇందులో స్కిన్ షోతో పాటు బోల్డ్‌గా కనిపించాల్సి ఉంటుందట. అయిన కూడా ఇష్టపడి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని అంటున్నారు. ఆమె పాత్ర సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని టాక్. ఇక ఇప్పటికే ఈ భామ సెట్‌లో అడుగుపెట్టిందని, పలు కీలక సన్నివేశాలు కూడా చిత్రీకరిస్తున్నారని సమాచారం. అయితే కయాదు లోహర్ చేస్తున్న ఈ రిస్క్‌ని కొందరు అభినందిస్తుండగా, మరి కొందరు విమర్శిస్తున్నారు. ఇక ప్యారడైజ్ విషయానికి వస్తే వచ్చే ఏడాది మార్చి 26న చిత్రం విడుదల కానుంది. ఈ సినిమాకి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు.




# సినిమా పరిశ్రమపై సెటైరికల్‌గా రాబోతున్న విశ్వక్ సేన్ 'ఫంకీ'

విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఫంకీ' సినిమా గురించి కీలక విషయాలను వెల్లడించారు నిర్మాత నాగవంశీ. ఈ సినిమా చిత్ర పరిశ్రమపై సెటైరికల్‌గా తెరకెక్కుతుందని ఇందులో విశ్వక్ దర్శకుడి పాత్రలో కనిపించబోతున్నారని విశ్వక్ తెలిపాడు. జాతిరత్నాలు, ప్రిన్స్ వంటి కామెడీ సినిమాలను తెరకెక్కించిన కేవీ అనుదీప్ దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమాలో తమిళ నటి కాయదు లోహర్ కథానాయికగా నటిస్తుండగా.. ప్రస్తుతం ఆమె డేట్స్ కోసం ఎదురుచూస్తున్నామని నాగవంశీ తెలిపాడు. ఫంకీలో ఇప్పటివరకు వచ్చిన అవుట్‌పుట్ చాలా బాగా వచ్చిందని నాగవంశీ అన్నారు. ఈ సినిమా విశ్వక్ సేన్ కెరీర్‌కు, అలాగే దర్శకుడు కేవీ అనుదీప్‌కు చాలా ముఖ్యమైన చిత్రంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# హరిహర వీరమల్లు2 పై క్రేజీ అప్‌డేట్ ఇచ్చిన నిధి అగర్వాల్..

## ఫ్యాన్స్ ఖుష్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, నిధి అగర్వాల్ హీరోయిన్‌గా రూపొందిన భారీ పౌరాణిక చిత్రం 'హరి హర వీరమల్లు'. ఏఎం రత్నం నిర్మాణంలో, క్రిష్ మరియు జ్యోతికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జులై 24న గ్రాండ్ రిలీజ్ కానుంది. అయితే ఈ మూవీ ప్రమోషన్స్‌లో పవన్ అంత యాక్టివ్‌గా పాల్గొనడం లేదు. దర్శకుడు క్రిష్ మిడ్‌స్టేజ్‌లో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్న నేపథ్యంలో ఆయన కూడా ప్రమోషన్ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. జ్యోతికృష్ణ ప్రస్తుతం ప్రమోషన్స్‌లో యాక్టివ్‌గా ఉన్నప్పటికీ తెలుగు ప్రేక్షకుల్లో ఆయనకు గుర్తింపు తక్కువగా ఉండడంతో పెద్దగా బజ్ కనిపించడం లేదు.ఈ నేపథ్యంలో మొత్తం ప్రమోషన్ బరువు బాధ్యతలు నిధి అగర్వాల్ భుజాలపై పడింది. పంచమి పాత్రలో మెప్పిస్తున్న నిధి, గత రెండు మూడు సంవత్సరాలుగా ఈ సినిమాపై భారీ నమ్మకంతో ఎదురుచూస్తోంది. ఈ సినిమాతో ఆమె రేంజ్ మారుతుందని ఫ్యాన్స్ కూడా భావిస్తున్నారు. ఇక సినిమాకి సంబంధించిన ప్రతి ప్రమోషన్ కార్యక్రమంలో నిధి యాక్టివ్‌గా పాల్గొంటుంది. తాజాగా ఓ మీడియా ఇంటర్వ్యూలో పాల్గొన్న నిధి అగర్వాల్, 'హరి హర వీరమల్లు'తో పాటు పార్ట్ 2 గురించి కూడా కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించింది. మొదట సినిమాను ఒకే పార్ట్‌గా రూపొందించాలనుకున్నప్పటికీ, కథ విస్తృతంగా ఉండటంతో రెండు భాగాలుగా చేయాలని నిర్ణయించారని తెలిపింది. ఇప్పటికే పార్ట్ 2కి సంబంధించిన 20 నిమిషాల సీన్స్ షూట్ పూర్తయ్యాయని చెప్పి అభిమానులని ఆనందింపజేసింది. నిధి చెప్పిన ప్రకారం, వీరమల్లు పార్ట్ 2లో కూడా ఆమె కీలక పాత్రలో కనిపించనుంది. అలాగే, రెండో భాగం మరింత పవర్‌ఫుల్‌గా ఉంటుందని తెలియజేసింది. అయితే షూటింగ్ మిగతా భాగం ఎప్పుడవుతుందనేది మాత్రం ఇంకా స్పష్టత లేదు. పవన్ రాజకీయాల్లో బిజీగా ఉన్న నేపథ్యంలో పార్ట్ 1 హిట్ అయితేనే పార్ట్ 2పై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.మరి ఏం జరుగుతుందో చూడాలి.



# దుల్కర్ సల్మాన్ జోడీగా బుట్టబొమ్మ ?

బుట్టబొమ్మ పూజా హెగ్డేకు హిట్ అనేది పలకరించి దాదాపు అయిదేళ్లు కావస్తుంది. 'అల వైకుంఠపురం' తర్వాత ఆమెకు హిట్ లేదు. కానీ అవకాశాలు మాత్రం తలుపు తడుతూనే ఉన్నాయి. పూజా హెగ్డే అందమే అందుకు కారణం కావొచ్చు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ తమిళ అగ్ర నటుడు విజయ్ చివరి చిత్రం 'జననాయగన్'లో హీరోయిన్‌గా నటిస్తున్నది. అలాగే లారెన్స్ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న 'కాంచన 4' లోనూ ఈ బుట్టబొమ్మే కథానాయిక.రీసెంట్‌గా సూపర్‌స్టార్ రజనీకాంత్ 'కూలీ' సినిమా స్పెషల్ సాంగ్‌లో కూడా పూజా నర్తించిన విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఈ అందాలభామను మరో అద్భుత అవకాశం వరించిందట. దుల్కర్ సల్మాన్ తెలుగులో ఓ ప్రేమకథా చిత్రంలో నటిస్తున్నారు. నూతన దర్శకుడు హరి దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో పూజా హెగ్డే కథానాయికగా ఎంపికైనట్టు తెలుస్తున్నది. అదే నిజమైతే.. పూజా రొట్టె విరిగి నేతిలో పడ్డట్టే.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492